కార్పొరేషన్ రోడ్డుకు పెద్దిరెడ్డి గేట్లు !

దగ్గరదారికోసం తెరవాలంటున్న రెండు కాలనీల జనం



కార్పొరేషన్ రోడ్డుకు అడ్డుగా పెట్టిన గేట్లు

తిరుపతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ నిధులతో 18వ డివిజన్ పరిధిలో మారుతీనగర్- రాయల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ వేసిన రోడ్డు అందుబాటులో లేక మూడున్నరేళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకూడదని రెండు వైపులా పెద్ద గేట్లు ఏర్పాటు చేసేశారు.వైసీపీ పాలనలో దాదాపు రూ.80లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి పెద్దిరెడ్డి ఇంటి చుట్టూ సిమెంటు రోడ్లు వేశారు. మారుతీనగర్-రాయల్ నగర్ ప్రాంతాలను కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20)ఒకటి, రూ9.50లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20) మరొకటి రెండు విడతలుగా నామినేటెడ్ కింద టెండరిచ్చారు.నాణ్యతలో ఏమాత్రం రాజీపడకుండా సిమెంట్‌రోడ్డును వేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డుల్లో నమోదైవుంది.ఆ వీధినుంచి ఈ వీధికి కొత్త రోడ్డుద్వారా దాదాపు 300 మీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. లేదంటే కిలోమీటరుకు పైగా చుట్టుకుని వెళ్లాల్సి వుంటుంది.కానీ రోడ్డు వేసిందే తడవుగా మాజీ మంత్రి ఇరువైపులా రెండు బలమైన గేట్లు పెట్టించేశారు.ఆయనతో పాటు వారి అనుచరుల వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. మంత్రి ఇంటి సమీపంలో వున్న బండారు ఆంజనేయస్వామి ఆలయానికి పక్కన రోడ్డుకు రూ9.71 లక్షల (ఐఎఫ్‌బి నెం:170/19-20) అంచనాతో ఒకటి, ఆలయానికి దక్షిణం వైపు రోడ్డు రూ9.90లక్షల అంచనాతో ఒకటి (ఐఎఫ్‌బి నెం:205/19-2), దీంతోపాటు రూ4.65లక్షలతో 8-49/1 నుంచి ఎయిర్‌బైపాస్ రోడ్డుకు చేరేలా మరో రోడ్డు పనులకు అంచనా వేసి నామినేషన్ కింద టెండరిచ్చి ఆగమేఘాల మీద పనులను పూర్తిచేశారు.ఈ మూడు రోడ్లు స్థానికులకు అందుబాటులో వున్నాయి.పెద్దిరెడ్డి గేట్లు వేసి మూసేసిన రోడ్లుకూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై గత సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో టీడీపీ నేతలు కమిషనర్‌కు వినతిపత్రం కూడా అందజేశారు.

జగనన్న భూరక్ష
రైతులకు శిక్ష



జగనన్న భూరక్ష పేరుతో వేసిన సర్వే రాళ్లు

శ్రీకాళహస్తి, జూలై 3: జగనన్న భూరక్ష పేరుతో గత ప్రభుత్వం చేసిన రీసర్వే రైతుల పాలిట శిక్షగా మారింది. అనాలోచిత నిర్ణయాలతో గత పాలకులు చేసిన ఎల్‌టీఎం విధానం కారణంగా చాలా చోట్ల భూముల లావాదేవీలు స్తంభించిపోయాయి. దీంతో అవసరాలకోసం అమ్ముకోవాలనుకుంటున్న అన్నదాతలు ఆ వీల్లేక ఆవేదన చెందుతున్నారు.అనాదిగా భూముల లావాదేవీలు ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పేరుతో రీసర్వే చేస్తామంటూ ప్రకటించి ముందుగా కొన్ని పంచాయతీలను ఎంపిక చేసింది. ప్రజా ధనం వెచ్చించి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పేరుతో సర్వేరాళ్లను సిద్ధం చేశారు.కొన్ని పంచాయతీల్లో రీసర్వేలు చేశారు. గతంలో ఉన్న సర్వే నెంబర్లు, ఫీల్డ్ మ్యాప్‌లను రీసర్వే పేరుతో పక్కన పెట్టారు. ఆయా గ్రామాల్లోని రైతులకు సర్వే నెంబర్లకు బదులుగా ఎల్‌పీఎం నెంబర్లను కేటాయించారు.దశాబ్దాలుగా కొనసాగుతున్న భూముల విస్తీర్ణాన్ని ఆన్‌లైన్‌లో గందరగోళంగా మార్చేశారు. ఒక రైతుకు ముందున్న భూమి విస్తీర్ణం కన్నా పెంచడం లేదా తగ్గించేయడం చేశారు. భూముల కొలతలు తగ్గిపోయిన రైతులు మొత్తుకున్నా పట్టించుకోకుండా ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చేశారు. మరికొందరికి ఉన్న భూమి కన్నా ఎక్కువ విస్తీర్ణం నమోదు చేశారు. గతంలో ఎవరైనా స్కెచ్ కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు వెంటనే ఇచ్చేవారు. రీసర్వే తరువాత ఎవరి భూములకూ స్కెచ్ ఇచ్చేందుకు వీల్లేకుండా చేశారు. భూముల లావాదేవీలు స్తంభించిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. శ్రీకాళహస్తి సబ్‌రిజిస్టార్ కార్యాలయ పరిధిలో సుమారు 15 గ్రామాల్లో జగనన్న భూరక్ష సర్వే జరిగింది. ఆయా చోట్ల చాలామంది రైతులు కొద్ది నెలల క్రితం పిల్లల చదువులు, పెళ్లిళ్లు ఇతర అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో తమ భూములను విక్రయించుకున్నారు. కొద్ది నెలల వ్యవధితో ఒప్పందం పత్రం రాసుకుని విక్రయించారు. ప్రస్తుతం అలాంటి విక్రయ ఒప్పందాలు రిజిస్ట్రేషన్‌కు దగ్గర పడ్డాయి. ఇలాంటి వారు భూములు రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించడం అది ఆన్‌లైన్‌లో అస్తవ్యస్తంగా నమోదు కావడం.. ఆ తరువాత ప్రభుత్వం మారిపోవడంతో చిక్కులు ఏర్పడ్డాయి. పాత సర్వే నెంబర్లు లేకుండా ఎల్‌పీఎం నెంబర్లు ఉండడం.. దానికి కూడా డిజిటల్ లాక్ అడ్డుగా ఉండటంతో రిజిస్ట్రేషన్లు చేసేందుకు వీల్లేకుండా పోతోంది.ప్రస్తుతం అత్యవసరం కోసం తమ భూములు అమ్ముకోవాలనుకునే వారికి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.



ఊరించి.. ఉసూరుమనిపించి...

ఉపరితలద్రోణి ప్రభావంతో బుధవారం పగలంతా ఉష్ణతాపం వేసవిని తలపించింది. అయితే సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. కరిమబ్బులు నలువైపులా విస్తరించి హోరుగాలులు మొదలయ్యాయి.భారీ వర్షం కురుస్తుందని జనం భావించారు. అయితే తిరుపతి పడమర దిశలో తేలిగ్గా కురిసిన వాన మిగిలిన ప్రాంతాలలో ఊసేలేకుండాపోయింది.భారీ వర్షం కురిసి వాతావరణం చల్లబడుతుందనుకున్న జనం కరిమేఘాలు చూస్తుండగానే మాయమైపోతుండడం చూసి నిరాశ చెందారు.

- తిరుపతి అర్బన్

ఇన్‌చార్జి డీపీవోగా సుశీలాదేవి



తిరుపతి(కలెక్టరేట్), జూలై 3: తిరుపతి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డిని బదిలీ అయ్యారు.అనంతపురం జిల్లా డ్వామా శాఖలో గుత్తి క్లస్టర్‌కు ఏపీడీగా తిరిగి రిపోర్టు చేసుకోవాలని ఆయనకు ఆదేశాలందాయి. ఆయన స్థానంలో డీఎల్‌డీవోగా పని చేస్తున్న సుశీలాదేవికి అదనపు బాధ్యతలు అప్పగించారు.పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సుశీలాదేవి తెలిపారు.



గూడూరు-రేణిగుంట మూడవ రైలు మార్గం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ

తిరుపతి(సెంట్రల్), జూలై 3: గూడూరు-రేణిగుంట రైల్వే జంక్షన్ల మధ్య మూడవ రైలు మార్గం ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు రైల్వే మంత్రిత్వశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రెండు స్టేషన్ల మధ్య 83.17 కిలో మీటర్లు దూరం వుంది.తిరుపతి జిల్లా పరిధిలో అధికారులు భూసేకరణ చేసి రైల్వే శాఖకు అప్పగించాల్సి వుంది. ఈ మార్గంలో రోజురోజుకూ సాధారణ రైళ్ళ రాకపోకలతో పాటు వస్తు రవాణా చేసే గూడ్స్ రైళ్ళ సంఖ్య కూడా పెరుగుతుండడంతో మూడవ రైలు మార్గం ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది.ఈ మార్గం ఏర్పడితే స్టేషన్ల బయట రైళ్లు వేచి ఉండాల్సిన అవసరం ఉండదు.

16 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జులై 3: పార్శిల్ , కొరియర్ సర్వీసులు,లగేజీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో బుధవారం తనిఖీలు చేపట్టిన పోలీసులు 16కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.అదనపు ఎస్పీ కులశేఖర్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బలగాలు తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండు, కొరియర్ సర్వీసుల ఆఫీసులు, రైల్వే పార్శిల్ కార్యాలయాలు, నవత, భారత్ మోటారు పార్శిల్ సర్వీసు కార్యాలయాలు, రేణిగుంటలోని స్టాకు పాయింట్లు, అనుమానిత పార్శిల్ సర్వీసులను తనిఖీ చేశారు.



పోలీసులు సీజ్ చేసిన గంజాయి

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకారం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 3: తిరుపతి జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ వెంకటేశ్వర్ గురువారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని 11.46గంటలకు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. బుధవారం సాయంత్రం వెంకటేశ్వర్ కుటుంబ సమేతంగా తిరుపతికి చేరుకున్నారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్వో పెంచలకిషోర్,ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు ఆయనకు విమానాశ్రయంలో స్వాగతం పలికారు.



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు స్వాగతం పలుకుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర

హడలెత్తించిన జెర్రిపోతులు

తిరుమల, జూలై3(ఆంధ్రజ్యోతి):తిరుమలలో బుధవారం రెండు భారీ జెర్రిపోతులు హడలెత్తించాయి. జీఎన్సీకి సమీపంలో హెచ్‌వీసీ కాటేజీ వద్ద వున్న ఎలక్ట్రికల్ జనరేటర్ వద్దకు సుమారు ఆరడుగుల పొడవున్న రెండు పాములు వచ్చాయి. వీటిని గుర్తించిన భక్తులు భయంతో పరుగులు తీశారు. వెంటనే అతిథిగృహాల సిబ్బంది టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కరనాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని పాములను పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

వైసీపీ ప్రభుత్వంలో అంతా అవినీతే

సంక్షేమ పథకాలన్నీ ఆ పార్టీ కార్యకర్తలకే

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేల ధ్వజం

అధికారులపై ప్రశ్నల వర్షం

చిత్తూరు రూరల్, జూలై 3: వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి రాజ్యమేలిందని ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. ఐదేళ్లలో ఎప్పుడూ జరగనివిధంగా బుధవారం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. కొత్త ఎమ్మెల్యేలైనా అధికారులను గుక్కతిప్పుకోనీయకుండా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, జరగని అభివృద్ధిపై నిలదీశారు. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశం మొదట కోరానికి కావాల్సి సభ్యులు రాకపోవడంతో కాసేపు వాయిదా వేశారు. మెల్లగా 28 మంది వరకు జడ్పీటీసీ సభ్యులు హాజరుకావడంతో సమావేశాన్ని మొదలుపెట్టారు. సమావేశం మొదలైన కాసేపటికే చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు సమావేశానికి వచ్చారు. వచ్చీరాగానే అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. వీరి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు నిల్చుండిపోయారు. 2 గంటలకు ముగియాల్సిన సమావేశం సాయంత్రం 4 గంటల వరకు సాగింది. ఇది సర్వసభ్య సమావేశాన్ని తలపించింది.

సీఎం చంద్రబాబు చిత్రపటం ఎక్కడ?



ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించి 20 రోజులు కావస్తున్నా చిత్రపటాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య ప్రశ్నించారు. సమావేశం మొదలు కాగానే.. సీఎం చిత్రపటం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలను హాలులో ఏర్పాటు చేయాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో గ్లోరియాను కోరారు. ఆ తర్వాత అధికారులు సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ సభ్యులైనప్పటికీ తమ పేర్లను శిలాఫలకాల్లో అధికారులు వేయడం లేదని, తిరిగి తమ పేర్లతో ఉన్న నూతన ఫలకాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

పెండింగ్ బిల్లుల్ని విడుదల చేయండి



గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు కేవలం ఆ పార్టీ వారనే కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదు. వడ్డీలకు తెచ్చి పనులు చేస్తే బిల్లులు ఆపేస్తే ఎలా? వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ విడుదల చేయాలి. గత ఐదేళ్లలో చిత్తూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి జరగలేదు. ఇకనైనా క్రమశిక్షణతో అభివృద్ధి చేయకపోతే మేముగానీ, సీఎంగానీ ఒప్పుకొనే పరిస్థితి లేదు.

- గురజాల జగన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

పసుపు కండువాతో వైసీపీ జడ్పీటీసీలు

ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ముగ్గురు వైసీపీ జడ్పీటీసీలు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి పసుపు కండువాలతో హాజరయ్యారు. వీరిలో తిరుమలయ్య (ఏర్పేడు), వెంకట సుబ్బారెడ్డి (శ్రీకాళహస్తి), పి.అర్చనదేవి (తొట్టంబేడు) ఉన్నారు.

● అలాగే, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు నారాయణవనం జడ్పీటీసీ సుమన్ తనతో పాటు సత్యవేడు, కేవీబీపురం, వరదయ్యపాళ్యం, బీఎన్ కండ్రిగ జడ్పీటీసీలతో కలిసి సమావేశానికి హాజరయ్యారు.



కొండలు, గుట్టలూ వదల్లేదు



జీడీనెల్లూరు నియోజకవర్గంలోని రైతులకు నాణ్యమైన విద్యుత్తు అందక మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయి. రైతులకు నాసిరకం కరెంటు ఇచ్చి.. క్వారీలకు, గ్రానైట్ ఫ్యాక్టరీలకు మాత్రం 24 గంటలూ నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందిస్తున్నారు. సబ్‌స్టేషన్లలో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లు చాలా మంది రాత్రిళ్ల మద్యం తాగి పడుకుంటున్నారు.కృష్ణాపురం ప్రాజెక్టును మరమ్మతు చేయకుండా దీనికి అరకిలోమీటరు కూడా లేని కత్తెరపల్లి ప్రాజెక్టును రూ.84 కోట్లతో మంజూరు చేయడం దారుణం. కేవలం కమీషన్ల కోసమే మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇలా చేశారు. చెరువులు, ప్రభుత్వ భూములు, కొండలను సైతం నారాయణస్వామి వదిలిపెట్టలేదు.వైద్య ఆరోగ్య శాఖలో పోస్టులన్నీ కూడా మాజీ మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గం, వైసీపీ కార్యకర్తలకు కేటాయించారని సమాచారం ఉంది. దీనిపై పూర్తి వివరాలను అందించాలి.

- థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

కాంట్రాక్టు ఉద్యోగాలన్నీ పెద్దిరెడ్డి, చెవిరెడ్డి వర్గాలకే



జిల్లాలోని పలు శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలన్నీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరులకే కేటాయించారు. డీఆర్డీఏలో ఇప్పటికీ పలు హోదాల్లో ఉంటూ కొందరు వైసీపీ సర్వేల కోసం పనిచేశారు. తుడాలో కాంట్రాక్టు లేబర్ పేరుతో 60 మందికి పైగా చెవిరెడ్డి ఇంటి వద్ద పీఆర్వోలుగా, వైసీపీ సంబంధించిన పనులు చేస్తున్నారు. వీళ్లకు ఇప్పటికీ తుడా నుంచి జీతాలు అందుతున్నాయి. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో అభివృద్ధి పేరిట రూ.వంద కోట్ల తుడా నిధులతో చెవిరెడ్డి భారీ స్కాం చేశాడు. నేను అభివృద్ధికి వ్యతిరేకం కాదు. కానీ, ఆ చెరువులో పార్కులు, కట్టడాల వల్ల గతంలో కురిసిన వర్షాలకు అవిలాల, సాయినగర్, గాంధీపురం, ఓటేరు, పేరూరు ప్రాంతాల్లో వరద ప్రవహించి దెబ్బతిన్నాయి. చెరువులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్న నిబంధనలున్నా.. తుమ్మలగుంట చెరువులో మాత్రం ఈ పనులకు నిధులు ఎలా విడుదల చేశారు? వీటికి బాధ్యులైన అధికారులను సస్పెండు చేయాలి. ఇక, మామండూరు జగనన్న కాలనీలో చెవిరెడ్డి దగ్గర పనిచేసే గన్‌మ్యాన్, పీఆర్వోలు, వైసీపీ నాయకులకు వారి బినామీ పేర్లతో ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలి. తిరుపతి రూరల్‌కు తెలుగు గంగ నీటి సరఫరా కోసం గతంలో ఇచ్చిన జీవోను అమలు చేసి కొత్తగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి. అలాగే కార్యదర్శులతో చెవిరెడ్డి కాన్ఫరెన్స్‌లోకి తీసుకొని మాట్లాడటంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

ఐదేళ్లలో అభివృద్ధినే మరిచారు



ఈ ఐదేళ్లలో పూతలపట్టు నియోజకవర్గంలో అభివృద్ధిని పట్టించుకోలేదు. కొన్ని గ్రామాల్లో తాగునీరు లేకుంటే, మరికొన్నిగ్రామాల్లో కాలువలు, రోడ్లు సరిగా లేవు. గడిచిన ఐదేళ్లలో రూ.126 కోట్లతో అభివృద్ధి చేసినట్లు రికార్డుల్లో చెబుతున్నా.. అవెక్కడా కనపడడం లేదు. కనీసం వారానికి ఒకసారి తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం లేదు. ప్రజలు డయేరియాతో అల్లాడిపోతున్నారు.గత ప్రభుత్వంలో ఐరాల మండలం, నాంపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన ఓ పిల్లవాడు 100 శాతం అంగవైకల్యంతో ఉన్నా ఏవో కారణాలు చూపి పింఛన్ ఇవ్వకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో చదివి ఆశ్చర్యపోయా. ఇవన్నీ మారాలి లేదంటే మారుస్తా.

- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

నెత్తకుప్పం జాతరలో అపశ్రుతి

● విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రామచంద్రాపురం, జూలై 3: నెత్తకుప్పం జాతరలో అపశ్రుతి దొర్లింది. విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందారు. గ్రామంలో మంగళవారం రాత్రి జాతర ప్రారంభమైంది. బుధవారం వేకువజామున అమ్మవారిని ఊరేగించాక నడివీధిలో కొలువుదీర్చారు. మధ్యాహ్నం గ్రామ బలి కార్యక్రమాన్ని గోపి(45) అనే వ్యక్తి నిర్వహించాడు. అమ్మవారు కొలువు దీరే చోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోని ఇద్దరు త్రుటిలో తప్పించుకున్నారు. గోపి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆరోగ్యంగా ఉన్నా అంగ వైకల్య పింఛనా..?

● బయటపడిన వైసీపీ సర్పంచ్, ఆమె భర్త అక్రమం


సర్పంచ్ భారతి, దామోదరనాయుడు

చంద్రగిరి, జూలై 3: అంగవైకల్యం లేకున్నా గత ప్రభుత్వ పెద్దల అండతో వైసీపీ సర్పంచ్, ఆమె భర్త వికలాంగుల పెన్షన్ పొందుతున్న వైనమిది. ఎం.కొంగరవారిపల్లె వైసీపీ సర్పంచ్ జాగర్లమూడి భారతి, ఆమె భర్త దామోదరనాయుడులు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. అయినా అంగ వైకల్యం సర్టిఫికెట్లు సంపాదించి పెన్షన్ పొందుతున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ఈవిషయం వెలుగు చూసింది. సర్పంచ్ భారతి భర్త దామోదరనాయుడు 2020 డిసెంబరు 12న అంగవైకల్యం సర్టిఫికెట్ పొందాడు. భారతి 2022 ఆగస్టు 8న అంగ వైకల్యం సర్టిఫికెట్ పొందింది. వీరిద్దరూ 2022 సెప్టెంబరులో పెన్షన్ కోసం దరఖాస్తు చేశారు. పెన్షన్ మంజూరైంది. ఇటీవల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీకి టీడీపీ నాయకులు పెన్షనర్ల జాబితా తీసుకున్నారు. ఇందులో సర్పంచ్, ఆమె భర్త ఇద్దరి పేర్లు ఉండటంతో వారు అవాక్కయ్యారు. వీరికి వికలాంగుల పెన్షన్ ఎలా ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో వెంకట సూర్యసాయిని వివరణ కోరగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి చర్యలు తీసుకొంటామన్నారు.

నానీ గెలుపుతో తిరుమలకు పాదయాత్ర



భాకరాపేట, జూలై 3: ఎమ్మెల్యేగా పులివర్తి నాని గెలవడంతో చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బుగ్గారెడ్డిగారి రమేశ్ రెడ్డి, నరసింహారెడ్డి తమ కార్యకర్తలతో కలిసి బుధవారం శ్రీవారి మెట్టు ద్వారా తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. తిరుమలలో వెంకటేశ్వర స్వామికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటామని వారు తెలిపారు.

పోలీసు స్టేషన్లను సందర్శించిన ఎస్పీ


ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

పాకాల, జూలై 3: స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు. ఎస్సైలు వారి పరిధిలోగల సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించాలన్నారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగరాదని, తాగి వాహనాలను నడపరాదని అన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. సీఐ శ్రీరాముడు, ఎస్సైలు లోకేష్ కుమార్, ఇషాక్ బాషా, హెడ్ కానిస్టేబుల్ సోమశేఖర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రగిరి: చంద్రగిరి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో పోలీసులు ప్రవర్తించే తీరు గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని ఆయన సూచించారు. రోజూ గ్రామాలను సందర్శించి నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు. సీఐ రామయ్య, ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సత్యమ్మ గంగజాతర



పాకాల, జూలై 3: పాకాల గ్రామదేవత సత్యమ్మ గంగజాతర బుధవారం వైభవంగా ముగిసింది. గత నెల 25వ తేదీన గంగమ్మ జాతరకు చాటింపు వేశారు. వారం పాటు జాతర ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనాల్లో అమ్మవారి ప్రతిమను ఊరేగించారు. మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ భారీగా బాణాసంచా కాల్చారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

తలకోన నీటి మళ్లింపుపై సమగ్ర నివేదిక

ఎమ్మెల్యే నాని ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ఎర్రావారిపాలెం, జూన్ 3; తలకోన నీటి సద్వినియోగంపై అడుగులు పడుతున్నాయి. దీంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ అటవీ ప్రాంతం నుంచి వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలిసి పోతున్న సంగతి తెలిసిందే. దీనిపై కొన్నాళ్లుగా తలకోన నీటి సాధన కమిటీ అధ్యక్షులు మారేళ్ళ శ్రీనువాసులు ఆధ్వర్యంలో ఉద్యమం చేశారు. తలకోన నీటిని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల చెరువులకు మళ్లించి సాగుకు కృషి చేస్తానని ఎన్నికల సమయంలో పులివర్తి నాని చెప్పారు. ఎమేల్యేగా గెలిచిన వెంటనే ఆయన ఈవిషయం మీద దృష్టి పెట్టారు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ఇరిగేషన్ అధిరులను ఇటీవల ఆదేశించారు. ఈ క్రమంలో తిరుపతి ఇరిగేషన్ ఈఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలోని బృందం బుధవారం మడి చెరువు, వలసపల్లె చెరువులను పరిశీలించింది. ఏటా సముద్రంలోకి వృధాగా పోతున్న నీటి వివరాలను సేకరించింది. అధికారులు సమగ్ర నివేదిక తయారు చేసి ఎమ్మెల్యే నానికి సమర్పించనున్నారు. ఇరిగేషన్ అధికారులతో పాటు తలకోన సాధన కమిటీ అధ్యక్షులు శ్రీనివాసులు, రైతులు పరిశీలనలో పాల్గొన్నారు.

ఆక్రమణదారుపై చర్యలు తీసుకోండి


చెరువు కబ్జాపై ఫిర్యాదు చేస్తున్న విజయ కుమార్

భాకరాపేట, జూలై 3; చెరువు స్థలాన్ని కబ్జాచేస్తున్న వ్యక్తిపై సర్పంచ్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. దేవరకొండలోని సర్వే నెంబరు 534లో చెరువు భూమి, 586 సర్వే నెంబరులోని 5.05 ఎకరాల రస్తా భూమిని శింగంశెట్టి నారాయణ ఆక్రమించేసి తన పొలంలో కలిపేసుకుంటున్నారని సర్పంచ్ యనమల విజయ కుమార్ బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రభుత్వ భూమిలో ఏటా కనుమ పర్వదినంలో కాటమ రాజు ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇందులో కుమ్మరకుంట,జంగంశెట్టి కుంట ఊట చెరువు కూడా ఉందన్నారు. చట్టప్రకారం దురాక్రమణాదారునిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు పశువు మేత కోసం ఉపయోగించే ఈ భూమి కాపాడాలని సర్పంచ్ విజయ కుమార్ కోరారు.

రాహుల్‌గాంధీపై చర్యకు డిమాండ్

తిరుపతిరూరల్, జూలై 3: హిందువులను అవమానపరిచేలా మాట్లాడిన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీపై చర్యలు తీసుకోవాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వ్యక్తిగత రాజకీయ అభివృద్ధి కోసం రాహుల్‌గాంధీ హిందువులను హింసావాదులుగా పేర్కొనడం తగదన్నారు. అల్పసంఖ్యాక వర్గాల ఓట్ల కోసం హిందువులను కించపరుస్తూ మాట్లాడడం సబబుకాదని హితవు పలికారు. హిందువులను అవమానపరిస్తే సహించేదిలేదన్నారు.




ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం - డంపింగ్ యార్డులో ప్లాస్టిక్‌ను తింటున్న ఆవులు - చెత్త డంప్ చేసిన యార్డు

ప్రజలు, మూగజీవాల పాలిట శాపంగా మారిన డంపింగ్‌యార్డు

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

మంగళం, జూలై 3: ఇళ్ల నుంచి, వ్యాపార సంస్థల నుంచి వ్యర్థ పదార్థాలను సేకరించి, వాటి ద్వారా సంపద సృష్టించి ఆర్థికంగా ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా గతంలో టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కార్యక్రమం ఏర్పాటు చేస్తే, గత వైసీపీ ప్రభుత్వం దానిని విస్మరించింది. దీంతో డంప్ చేసిన చెత్తతో ప్రజల ఆరోగ్యాలతో, మూగజీవాల ప్రాణాలతో చెలగాటమాడే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ పరిధిలో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రెండు ఎకరాల స్థలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో వ్యర్థాలనుంచి వర్మీ కంపోస్టు తయారు చేయాలని, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల ఇతరాలను రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ కార్యక్రమం బాగానే జరిగింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల పాటు ఈ సంపద తయారీ కార్యక్రమం కొనసాగింది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆ తరువాత దీనిని పట్టించుకునే వారే కరువయ్యారు. సప్తగిరికాలనీ, మంగళం క్వార్టర్స్, రణధీరపురం, న్యూమంగళం, తిరుమలనగర్ పంచాయతీల నుంచి చెత్తను ప్రతిరోజు 8 నుంచి పది ట్రాక్టర్ల వరకు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ చెత్త పక్కనే ఉన్న కాలువలోకి చేరి కొట్టుకుపోయి సమీప చెరువులో చేరుతోంది. దీంతో చెరువులు పూర్తిగా కలుషితమై దోమల ఉత్పత్తి కేంద్రంగా మారటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. డంపింగ్ యార్డులో చేరిన ప్లాస్టిక్ కవర్లు, వైర్లను మూగజీవాలైన ఆవులు, గేదెలు తింటున్న కారణంగా అవి కూడా ప్రాణాపాయ స్థితిలో ఉంటున్నాయి. అటు ప్రజలకు, ఇటు మూగజీవాలకు ఇబ్బందిగా మారుతున్న డంపింగ్‌యార్డును సంపద తయారీ కేంద్రంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో ఆ రోడ్డుపై వెళ్లాలంటే దడ


వర్షాకాలంలో కొత్త నెన్నూరు రోడ్డు బురదమయం(పాతచిత్రం)

● కొత్త నెన్నూరు గ్రామస్థుల ఆందోళన

రామచంద్రాపురం, జూలై 3: నెన్నూరు నుంచి కొత్త నెన్నూరువరకు వెళ్లే రోడ్డు వర్షాకాలం వస్తే ప్రజలకు దడ పుట్టిస్తోంది. తిరుపతి, పుత్తూరు ప్రధాన రహదారి నెన్నూరు నుంచి కొత్త నెన్నూరు, శాఖమూరికండ్రిగ, కొత్తకండ్రిగ, కన్నికాపురం గ్రామాలకు ఏడు కిలోమీటర్ల మేర లింకు రోడ్డు ఉంది. నెల క్రితం వరకు గ్రావెల్ క్వారీ నుంచి భారీ టిప్పర్లు కొత్త నెన్నూరు మీదుగా తిరిగేవి. దీంతో కిలోమీటరు మేర భారీగా గుంతలు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోతోంది. గుంత ఎక్కడ ఉందో తెలియక వాహన చోదకులు బోల్తా పడ్డ సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు వర్షాకాలం లోపు గుంతలు పూడ్చి రోడ్డుకు మరమ్మతు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం


ఉభయదేవేరిలతో ఊరేగుతున్న శ్రీకృష్ణస్వామి

తిరుచానూరు, జూలై 3: తిరుచానూరులో శ్రీకృష్ణస్వామికి బుధవారం రాత్రి వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కేటీ మండపంలో ఉత్సవర్లకు నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితులైన రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుబాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో డ్రైనేజీ సమస్య పరిష్కరించండి


గ్రామసభలో టీడీపీ నాయకులు, గ్రామస్తుల వినతి

తిరుపతి రూరల్, జూలై 3: తుమ్మలగుంట పంచాయతీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని టీడీపీ నాయకులు,గ్రామస్తులు కోరారు. బుధవారం గ్రామ సర్పంచ్ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి, జిల్లా రైతునాయకుడు బిరుదాల కృష్ణారెడ్డిలు గ్రామస్తులు కలసి స్థానిక సమస్యలను వివరించారు. పంచాయతీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఈవిషయమై పలుమార్లు విన్నవించినా యూడీఎస్ ఏర్పాటుకు ముందుకు రాలేదన్నారు. ఉప్పరపల్లెలో పూర్తిస్థాయిలో తాగు నీరు కుళాయిలను ఏర్పాటు చేయాలన్నారు. స్మశానవాటిక అభివృద్ధి పనులు చేపట్టాలని, అంగన్వాడీ, కమిటీభవన సమస్యలను పరిష్కరించాలని కోరారు. అరుంధతివాడలో స్మశాన ప్రహరీగోడని నిర్మించాలని, రోడ్లు వేయాలని కోరారు. వివిధ సమస్యలపై వారు వినతి పత్రం సమర్పించారు. సెక్రటరీ శ్రీనివాసులు, ఎంపీటీసీ వై. బుజ్జమ్మ, వార్డుసభ్యులు రామకృష్ణ, గురవారెడ్డి, అమరావతి, పి.భరత్‌కుమార్ రెడ్డి, టీడీపీ నాయకులు కేశవులశెట్టి, శ్రీనివాసులు, బిరుదాల సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మకు సారె


సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, బడి సుధాయాదవ్

తిరుపతి(రూరల్), జూలై 3: తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన నడివీధి గంగమ్మ జాతరలో అమ్మవారికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సాంప్రదాయబద్ధంగా సారె సమర్పించారు. గ్రామ సర్పంచ్, ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు యువత, గ్రామస్తులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలుకగా... మహిళలు మంగళ హారతులు పట్టారు. సాంప్రదాయబద్ధంగా ఎమ్మెల్యేకు తలపాగా చుట్టి, డప్పుల చప్పుళ్లమధ్య ఊరేగింపుగా సారెను తీసుకెళ్లి జాతర నిర్వాహకులకు సమర్పించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామదేవతల అభయంతో ఇప్పటికీ గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, గంగమ్మ సేవలో తరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఫుట్‌పాత్‌పై దర్జాగా రేకులషెడ్డు నిర్మాణం


రోడ్డు పక్కనే వేసిన రేకుల షెడ్డు

తిరుపతి రూరల్, జూలై 3: తిరుపతి రూరల్ మండలం ఆర్‌సీపురానికి వెళ్లే ప్రధానరహదారిలో అవిలాల అంబేడ్కర్‌కాలనీ ఎదురుగా స్థానిక వైసీపీనేత ఫుట్‌పాత్‌ని ఆక్రమించి దర్జాగా రేకులషెడ్డు నిర్మించారు. గాంధీపురం పంచాయతీకి చెందిన ఈ ప్రభుత్వ స్థలంలో అవిలాలకు చెందిన వైసీపీనేత దాదాపు నాలుగునెలల కిందట కంటైనర్ లాంటి రేకులషెడ్డు నిర్మించి.. దాన్ని మెకానిక్‌షాపుకు అద్దెకు ఇచ్చారు. దాంతో ఈషాపు ఎదురుగా రోజూ పదులసంఖ్యలో మరమ్మతుల కోసం వచ్చే ఆటోలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈమార్గంలో వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పురిటిబిడ్డ మృతి



పుత్తూరు అర్బన్, జూలై 3: పొత్తిళ్లలోనే ఆ బిడ్డకు నూరేళ్లు నిండాయి. కళ్లు విప్పి లోకం చూడకనే లోకం విడిచివెళ్లిపోయాడు. పుట్టిన మరునాడే విగతజీవుడయ్యాడు. వైద్యుల అలసత్వం కారణంగానే ఈ ఘోరం జరిగిందని బిడ్డ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ జరిపారు. కార్వేటినగరం మండల పరిధిలోని ద్వారకానగరానికి చెందిన జి.నరేష్ భార్య పూర్ణిమ పురిటి నొప్పులతో తొలికాన్పు కోసం సోమవారం సాయంత్రం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. పరీక్షించిన గైనకాలజిస్ట్ హిమబిందు గర్భిణీ పూర్ణిమకు అదేరోజు రాత్రి కాన్పు చేయడంతో మగబిడ్డను ప్రసవించింది. మంగళవారం రాత్రి రౌండ్స్‌కు వచ్చిన డాక్టర్ దినేష్ బిడ్డ ఉలుకుపలుకూ లేకుండా ఉండడంతో ప్రత్యేక వార్డుకు తీసుకెళ్లి పరీక్షలు జరిపారు. అరగంట తరువాత బిడ్డ మృతి చెందినట్లు చెప్పడంతో పూర్ణిమ దంపతులు నిశ్చేష్టులయ్యారు. బిడ్డ లేడనే విషయం తెలియడంతో పూర్ణిమ సొమ్మసిల్లిపడిపోయింది. కాన్పు తరువాత వైద్యులు, నర్సులు బిడ్డ ఆరోగ్యపరిస్థితిని పట్టించుకోలేదని బిడ్డ తల్లిదండ్రులు ఆరోపించారు. కనీసం పూటకు ఒక్కసారి కూడా వచ్చి బాలింతను, బిడ్డను పరీక్షించలేదని వారు తెలిపారు. ఈ కారణంగానే తమ బిడ్డ మృతి చెందాడని వారు కన్నీటి పర్యంత మయ్యారు. పురిటి బిడ్డ మృతి చెందిన సంఘటనపై బుధవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ మురళీకృష్ణ విచారణ జరిపారు. బిడ్డ తల్లిదండ్రులు, వైద్యులతో పాటు నర్సులను వేరువేరుగా విచారించారు.దీనిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి 10గంటల సమయంలో బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గుర్తించిన డాక్టర్ దినేష్ కృత్రిమ శ్వాస ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. బిడ్డ పాలు తాగినప్పుడు ఊరిపితిత్తుల్లోకి వెళ్లడంతో మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు.సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కూడా ప్రభుత్వాస్పత్రిలో విచారణ జరిపారు. బిడ్డ తల్లిదండ్రులు, వైద్యులు, నర్సులను తహసీల్దార్ పుష్పకుమారి విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. నివేదికను చిత్తూరు కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

ఆర్‌సీపురంలో వర్షంతో ఊరట

రామచంద్రాపురం, జూలై 3: రాయలచెరువు కట్ట ప్రాంతంలో బుధవారం సాయంత్రం రెండు గంటల పాటు మోస్తరు వర్షం కురిసింది. వాహన చోదకులు ఎక్కడికక్కడ ఆగిపోయి ఇబ్బందులు పడ్డారు. పదిరోజులుగా పగటివేళ ఎండ తీవ్రత ఉన్నా రాత్రివేళ వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఊరట పొందుతున్నారు. ప్రస్తుత వర్షాల వల్ల చెరకు తోటలకు మేలు చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. వరిసాగుకు సమాయత్తం అవుతున్నారు.

10 నుంచి కల్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు

చంద్రగిరి, జూలై 3: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవాలు ఈనెల 10 నుంచి 12వ తేది వరకు నిర్వహించనున్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 10న పెద్ద శేష వాహనంపై, 11న హనుమంతు వాహనంపై, 12న గరుడ వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుంది. 13న పార్వేట ఉత్సవం నిర్వహించనున్నారు.

అధ్వానంగా పాకాల - దామలచెరువు రోడ్డు


ఊట్లవారిపల్లె సమీపంలో కుంటలను తలపిస్తున్న పాకాల-దామలచెరువు రోడ్డు

పాకాల, జూలై 3: పాకాల-దామలచెరువు రోడ్డుపై పలుచోట్ల ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడ్డాయి. ఊట్లవారిపల్లె సమీపంలో మరి అధ్వానంగా తయారైంది. రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి గుమ్మడివారి ఇండ్ల వరకు గోతులమయమై వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే పాకాల-నేంద్రగుంట రోడ్డు ఉప్పువంక సమీపంలో రోడ్డుపై గుంతలు పడ్డాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ



మంగళం, జూలై 3: మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఈవో మురళి ఆధ్వర్యంలో డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళం పరిధిలోని ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని నివాస ప్రాంతాల్లో ఐదేళ్ల లోపు చిన్నారులకు డయేరియా నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను, జింకు ట్యాబ్లెట్లను అందజేశామన్నారు. ఓవర్‌హెడ్, గ్రౌండ్ వాటర్ ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలన్నారు. పీహెచ్ఎన్ తాష్కెంట్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భాగస్వామ్యంతో పాడిపరిశ్రమలో పురోగతి


మహిళలకు చెక్కు అందజేస్తున్న వర్షాజోషి, శ్రీజ చైర్మన్ శ్రీదేవి

తిరుపతి రూరల్, జూలై 3: పాడిపరిశ్రమలో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోందని కేంద్ర పశుసంవర్థక, పాడిపరిశ్రమశాఖ అదనపు కార్యదర్శి వర్షాజోషి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలంలో బైపాస్ రోడ్డులోని జీఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ 10వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆధునిక పాడిపద్ధతులు అవలంభించడం, మహిళల భాగస్వామ్యం పెరగడం ద్వారానే పాల ఉత్పత్తిల్లో ఏపీ గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. పాల ఉత్పత్తిలో ఏపీ 5వస్థానంలో ఉందన్నారు. ఎన్‌డీడీబీ డెయిరీ సర్వీసెస్ చైర్మన్ డాక్టర్ మీనేష్ షా మాట్లాడుతూ ఈ పదేళ్లకాలంలో అనేక మైలురాళ్లను సాధించిన రైతులను అభినందించారు. వర్షాజోషితో శ్రీజ చైర్మన్ శ్రీదేవి కలసి మహిళలకు బోనస్ చెక్కు అందజేశారు.

ఉన్నతస్థాయికి విద్య సోపానం


విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేస్తున్న దొడ్ల కరుణాకర్‌రెడ్డి తదితరులు

తిరుపతిరూరల్, జూలై 3: విద్య ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని టీడీపీ జిల్లా ప్రచారకార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి(తుమ్మలగుంట) పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచి లక్ష్యాలను నిర్దేశించుకుని సాధనకు ప్రణాళికలు ఆచరించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి, బిరుదాల కృష్ణారెడ్డిలతో కరుణాకర్‌రెడ్డి కలసి విద్యార్థులకు కిట్స్ అందజేశారు. టీడీపీ నాయకులు రాధారాయల్, గురవారెడ్డి, అయప్ప, హెచ్‌ఎం భారతి, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐలు కుసుమ, శ్రీనివాసరావు

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ ఫోకస్

● ఎఫ్‌సీలు పొందిన బస్సుల సంఖ్య 1,104, పొందాల్సినవి 680

● స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం : డీటీవో ఆదినారాయణ

తిరుపతి (జీవకోన), జూలై 3: తిరుపతి జిల్లాలో పాఠశాల, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ అధికారులు ఫోకస్ పెట్టారు. జిల్లా పరిధిలోని తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట ఆర్టీఏ పరిధిలో పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి 1,784 బస్సులు ఉన్నాయి. అందులో జూలై 1 వరకు 1,104 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందగా, ఇంకా 680 బస్సులకు పొందాల్సి ఉంది. ఎఫ్‌సీల గడువు ముగిసిన వెంటనే బస్సులను యథావిధిగా కండీషన్‌లో పెట్టుకోవాల్సి ఉంటుంది. అనంతరమే ఆ బస్సులకు సర్టిఫికెట్లను ఆర్టీఏ అధికారులు జారీ చేస్తారు. తర్వాత రోడ్లపై బస్సులు తిరగాల్సి ఉంటుంది. ఫిట్‌నెస్‌తో పాటు ధ్రువపత్రాలు లేకుండా రోడ్లపై తిరిగితే ఆర్టీఏ అధికారులు ఆ బస్సులను సీజ్ చేస్తారు. ఓ పక్క పాఠశాలలు, మరో పక్క కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఆర్టీఏ అధికారులు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించారు. ఇప్పటి వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందని బస్సులపై కొరడా ఝుళిపించనున్నారు. ఇందు కోసం ప్రత్యేకించి స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా ఏపీ మోటర్ వెహికల్ రూల్ 186-జి ప్రకారం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ల బస్సులు ప్రత్యేక నిబంధనలు పాటించాల్సి ఉంది.

ఫిట్‌నెస్ లేకపోతే బస్సులు సీజ్ చేస్తాం

● ఆదినారాయణ, డీటీవో



రోడ్లపై తిరిగే ప్రతిస్కూల్, కళాశాల బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) తప్పనిసరిగా కలిగి ఉండాలి. లేని పక్షంలో ఆ బస్సులను సీజ్ చేస్తాం. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించాం. రోడ్లపై ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా తిరిగే స్కూల్ బస్సులను ఎంవీఐలు తనిఖీ చేసి ధ్రువపత్రాలు లేని పక్షంలో అపరాధ రుసుం విధించడంతో పాటు బస్సులను సీజ్ చేస్తాం. ఈ స్పెషల్ డ్రైవ్ నెల రోజుల పాటు కొనసాగుతుంది.

మాస్టర్ ప్లాన్ రోడ్లు ఇలాగేనా వేసేది?

నాలుగు నెలలకే డొల్లతనం బయటపడింది ● పెండింగ్ బిల్లులు ఆపండి : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


గుంత పడిన మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, సుగుణమ్మ, నరసింహ యాదవ్ తదితరులు

తిరుపతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): 'ఒక రోడ్డు వేస్తే ఐదేళ్లు చెక్కుచెదరకూడదు. అలాంటిది నాలుగు నెలలకే వైసీపీ ప్రభుత్వం వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్ల డొల్లతనం బయపడింది. అందుకే నాణ్యతా పరీక్షలు నిర్వహించండి. అంతలోపు కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు ఆపండి' అని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. హీరోహోండా రైల్వే గేట్-కాటన్ మిల్ ప్రాంతాన్ని కలుపుతూ 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డులో తారు తేలిపోవడం, గుంట పడటంపై మీడియాలో కథనాలు రావడంతో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ, బీజేపీ నేతలు బుధవారం ఆ రోడ్డును పరిశీలించారు. ఎందుకిలా జరిగిందని మున్సిపల్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీడీసీఎల్ వాళ్లు విద్యుత్ పైపులైను వేసేందుకు రోడ్డును తవ్వారని, అందువల్ల డ్యామేజి జరిగిందని వివరణ ఇవ్వబోతుండగా... తాను కూడా కాంట్రాక్టర్‌నని, రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా గాలికొదిలేశారని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జనావాసాలు లేని చోట రోడ్లు వేయడం ద్వారా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రజాధనం వృధా చేశారని ఆరోపించారు. ఆ నిధులతో నగరంలో దెబ్బతిన్న రోడ్లను బాగుచేసి ఉండవచ్చన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చేస్తుందని పైపై మెరుగులు దిద్ది అట్టహాసంగా రోడ్లు ప్రారంభించారన్నారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి తిరుపతిలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటిపైన విచారణ జరిపిస్తామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి నేతలు కృష్ణ యాదవ్, మున్సిపల్ ఇంజనీర్లు మోహన్, వెంకటరమణా రెడ్డి, విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. చింతమనేని ప్రభాకర్ శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.09 కోట్లు

తిరుమల, జూలై3(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.09 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. మంగళవారం 67,398 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,512 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

అధికారులతో సమీక్ష చేయలేదు

ఆరణి శివకుమార్

తిరుపతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను కమిషనర్ అదితి సింగ్ దృష్టికి తీసుకెళ్లేందుకే తాను కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లినట్టు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'తిరుపతిలో షాడో ఎమ్మెల్యే' అంటూ వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని వినతులను ఇచ్చేందుకు తాను మర్యాదపూర్వకంగా కమిషనర్‌ను కలిశానని, తాను అధికారులతో ఎలాంటి సమీక్ష నిర్వహించలేదని, ఎక్కడా కూడా ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు.

మిలో ఓపెన్ కరాటేలో ప్రతిభ



తిరుపతి(క్రీడలు), జూలై 3: మలేషియా దేశం కౌలాలంపూర్‌లోని టిటివంగ్స్ ఇండోర్ స్టేడియంలో గత నెలాఖరున నాలుగు రోజుల పాటు జరిగిన 23వ మిలో ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన యువకుడు చీమల పవన్‌కుమార్ ప్రతిభ కనబరిచాడు. క్లిష్టమైన మెన్ సీనియర్ కుమితె విభాగంలో ద్వితీయస్థానం కైవసం చేసుకున్నాడు. ఆ దేశ కరాటే క్రీడాధ్యక్షుడు డాక్టర్ టి.పొన్నియా చేతులమీదుగా వెండి పతకం, ప్రశంసాపత్రం అందుకున్నాడు. అలాగే మరో ఆరుగురు (సి.మిచిల్‌నరేష్, బందరుమిత్ర, కె.పవన్‌కుమార్, ఎన్.సూర్య, ఎస్.నైతిక్‌జైన్, డి.కృషి) క్రీడాకారులు కూడా వివిధ విభాగాల్లో ప్రాతినిధ్యం వహించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరందరూ తిరుపతిలోని నవీన్ మార్షల్‌ఆర్ట్స్‌లో డాక్టర్.పి.నవీన్ వద్ద శిక్షణ పొందారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్‌ను పలువురు అభినందించారు.

ఆర్టీసీ ఈయూ కార్యవర్గం


సభ్యులను సన్మానించిన చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), జూలై 3: ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గం ఖాళీలను భర్తీచేశారు. ఈ మేరకు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మురగమ్మ, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.మస్తాన్, జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.మల్లికార్జున, రీజనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా జి.ఆర్.చంద్ర, రీజనల్ పబ్లిసిటీ సెక్రటరిగా జె.సతీష్‌నాయుడు, రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరిగా కె.హరిప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ప్రజారవాణాధికారి కార్యాలయంలో ఈయూ జిల్లా కార్యదర్శి తాండాయం సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో డీపీటీవో చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈయూ రాష్ట్రకార్యదర్శి ఈ.రమేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గురునాథం, సభ్యులు పాల్గొన్నారు.

ఘనసన్మానం


పార్థసారథిని సన్మానిస్తున్న ఈయూ నేతలు, సభ్యులు

ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్‌గా ఉన్న పార్థసారథి, సీనియర్ అసిస్టెంట్ పట్టాభిల పదవీ విరమణ సందర్భంగా బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రజారవాణాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నేతలు వారి సేవలను కొనియాడారు. అనంతరం డీపీటీవో చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి సమక్షంలో పార్థసారథిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈయూ రాష్ట్ర కార్యదర్శి ఈ.ఆర్.కుమార్, జిల్లా అధ్యక్షుడు గురునాథం, కార్యదర్శి తాండాయం సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

పద్మావతిపురంలో ఏటీపీ కౌంటర్ ప్రారంభం



తిరుపతి (ఆర్టీసీ), జూలై 3: నగరంలోని పద్మావతిపురంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆథరైజడ్ ప్రైవేట్ బుకింగ్ ఏజెన్సీ కౌంటర్‌ను బుధవారం ఉదయం సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు ప్రారంభించారు. కె.విజయకుమార్‌కు ఏజెంట్‌గా అవకాశం కల్పించడంతో పద్మావతిపురంలోని ఓటేరుకు వెళ్లే దారిలో కేంద్రం ఏర్పాటు చేశారు. తొలిగా రేణిగుంటకు చెందిన భానుప్రసాద్ చపాతి బ్యాగును తిరుపతి నుంచి కావలికి బుకింగ్ చేశారు. దానికి సంబంధించిన రసీదును ఏటీఎం చేతుల మీదుగా అందజేశారు. ఈ కౌంటర్‌లో కార్గో సేవలతో పాటు దూరప్రాంతాలకు బస్సు టికెట్ బుకింగ్‌కూడా చేసుకోవచ్చని, ఉదయం 6గంటల నుంచి రాత్రి 11గంటల వరకు కౌంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. వినియోగదారులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎర్రచందనం కేసులో ముగ్గురికి జైలు

శ్రీకాళహస్తి,జూలై3:ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురికి ఆరు నెలల జైలు శిక్ష ఖరారైనట్లు శ్రీకాళహస్తి రూరల్ ఇన్‌ఛార్జి సీఐ నరసింహారావు తెలిపారు.శ్రీకాళహస్తి మండలంలోని గొల్లపల్లి అటవీ ప్రాంతంలో ఎర్ర చందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు 2014వ సంవత్సరంలో అప్పటి ఎస్ఐ సంజీవకుమార్‌కు సమాచారమందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశారు. తిరుపతి నగరం అంబేడ్కర్ నగర్‌కు చెందిన శివ, దాము, మురళి ఎర్రచందనం తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిరిమాండుకు తరలించారు. శ్రీకాళహస్తి న్యాయస్థానంలో ఈ కేసుకు సంబంధించి బుధవారం తీర్పు వెలువడింది. ముద్దాయిలు ముగ్గురికి ఆరునెలల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు సీఐ నరసింహారావు తెలిపారు. ఈ కేసు విచారణలో చురుగ్గా వ్యవహరించిన అధికారులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

తిరుమల ఆలయం ముందు శునకం!



ఆలయం వెలుపలి మార్గంలో శునకం - మీడియా ప్రతినిధులపై విజిలెన్స్ అధికారి ఆగ్రహం

తిరుమల, జూలై3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మరోసారి ఓ శునకం హల్‌చల్ చేసింది. ఏకంగా ఆలయం ముందుకు వచ్చి భక్తులను భయభ్రాంతులకు గురిచేసింది. నిబంధనల ప్రకారం వీధి కుక్కలు కనిపిస్తే హెల్త్ విభాగం సిబ్బంది వెంటనే పట్టుకుని తిరుపతికి తరలించి విడిచిపెట్టాలి. మూడునాలుగేళ్లుగా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో తిరుమల కొండపై వీధికుక్కల సంచారం పెరిగిపోయింది. వీధికుక్కలను చూసినా పట్టించుకోవడంలేదు. దీంతో ఎక్కడపడితే అక్కడ శునకాలు భారీగా కనిస్తున్నాయి. స్థానికులు నివసించే బాలాజీనగర్, భక్తులు బస చేసే కాటేజీలు, హోటళ్ల వద్ద కనిపించే శునకాలు ఇప్పుడు మాడవీధుల్లో సంచరిస్తున్నాయి. తాజాగా బుధవారం ఓ శునకం ఆలయం సమీపానికి వచ్చి హల్‌చల్ చేసింది. మహద్వారం సమీపం వరకు రావడం గమనార్హం. దర్శనం పూర్తిచేసుకుని ఆలయం వెలుపలకు వచ్చిన పలువురు భక్తులు ఈ శునకాన్ని చూసి భయపడ్డారు. శునకాలను నియంత్రించడంలో హెల్త్ విభాగం అధికారులు విఫలమైతే, కనీసం మాడవీధులలోకి రానియ్యకుండా చూసుకోవడంలో కూడా విజిలెన్స్ సిబ్బంది కూడా విఫలమవుతున్నారు. శునకం వెంట్రుకలు రాలిపడిన ప్రదేశం పూజకు పనికిరాదని పండితులు చెబుతున్న విషయం తెలిసిందే. అనుకోకుండా శునకాలు ఆలయంలోకి ప్రవేశిస్తే పెద్ద అపచారం అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శునకం సంచరించడాన్ని వీడియోలు, ఫొటోలు తీసిన మీడియా ప్రతినిధులపై విజిలెన్స్ అధికారులు ఆగ్రహించడం కొసమెరుపు. వీడియోలు, ఫొటోలు తీయడం ద్వారానే తరిమిన శునకం మళ్లీ ఆలయం ముందుకు వచ్చిందని ఓ అధికారి మీడియా ప్రతినిధులపై మండిపడ్డారు.

నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

● సెలవు ప్రకటించిన పలు ప్రైవేటు సంస్థలు

తిరుపతి(విద్య), జూలై 3: నీట్, నెట్ పరీక్ష పేపర్లు లీక్ కావడాన్ని నిరసిస్తూ పలు విద్యార్థి సంఘాలు బుధవారం దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. నీట్, నెట్ పరీక్ష పేపర్ లీక్‌పై సమగ్ర విచారణ జరిపించాలని, లీక్‌కు బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, జాతీయస్థాయి ప్రతిభా పాటవ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్ఓ, ఎన్ఎస్‌యూఐ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌కు విద్యార్థులందరూ సంపూర్ణంగా సహకరించి తరగతులు బహిష్కరించాలని, నిరసన ప్రదర్శనల్లో పాల్గొనాలని సంఘాలు పిలుపునిచ్చాయి. పలు విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునివ్వడంతో జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు 4వ తేదీన తమ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ విద్యాసంస్థలు మాత్రం యథావిధిగా నడుస్తాయని విద్యాశాఖాధికారులు చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18మందికి జరిమానా

తిరుపతి(లీగల్), జూలై 3: నగర పరిధిలో డీఎస్పీ రమణకుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన 19మందిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరిబాబు కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు.

ఫోర్జరీ కేసులో ఏడాది జైలు

తిరుపతి(లీగల్), జూలై 3: ఫోర్జరీ చేసి దొంగపత్రాలను ఒక ముద్దాయి బెయిల్ కొరకు ష్యూరిటీ ఇవ్వడానికి ప్రయత్నించిన తిరుపతికి చెందిన ప్రభుత్వ మాజీ ఉద్యోగి రాముకు ఏడాది జైలు శిక్ష రూ.1,500 జరిమానా విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. 2016లో ఇతడిపై తిరుపతి వెస్ట్‌ఎస్సై జయస్వాములు కేసు నమోదుచేసి సాక్ష్యాధారాలను కోర్టులో నిరూపణ చేశారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

నవోదయలో విశ్వం విద్యార్థుల హవా



తిరుపతి(విద్య), జూలై 3: జాతీయస్థాయిలో 2024-25 విద్యా సంవత్సరానికి నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి బుధవారం విడుదలచేసిన రెండవ జాబితాల్లో తమ విద్యార్థులు నలుగురు సీట్లు సాధించి ప్రతిభచాటారని తిరుపతికి చెందిన విశ్వంస్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. జీజే యశ్విన్‌కుమార్, భారత్, మోహిత్, వంశితశ్రీలు సీట్లు సాధించగా.. మొదటిజాబితాలో ఇప్పటికే మరో 37మంది విద్యార్థులు సీట్లు సాధించారన్నారు.వీరితో పాటు 9, 11తరగతుల మొదటి జాబితాల్లో 11మందితోపాటు మొత్తంగా 52మంది విద్యార్థులు సీట్లు సాధించి విజయకేతనం ఎగురవేశారని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 12 ఫిర్యాదులు


సదస్సులో పాల్గొన్న అధికారులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 3: తిరుపతిటౌన్, రూరల్ డివిజన్ల పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని ఈఈలు కె.వాసుదేవరెడ్డి, ఎన్.వాసురెడ్డి తెలిపారు. పాత తిరుచానూరురోడ్డులోని ఈఈ కార్యాలయంలో బుధవారం అధికారులు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు హామి ఇచ్చారు. కొన్ని సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశారు. రెండు డివిజన్ల డిప్యూటీ ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

భవన యజమానిపై దాడికి యత్నం


భవనం గోడపై రాస్తున్న అన్నా రామచంద్ర


భవనం

తిరుపతి (జీవకోన), జూలై 3 : బీసీ సంఘాల నేత అన్నా రామచంద్ర యాదవ్ ఓ భవన యజమానిపై దాడికి యత్నించినట్టు సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. తిరుపతిలోని సత్యనారాయణపురం సర్కిల్ నుంచి తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రకాశం పార్కుకు వెళ్లే రోడ్డును(విరజా మార్గం) 40 అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డుగా గతంలో అభివృద్ధి చేశారు. ఈ రోడ్డును ఈ ఏడాది మార్చి 15న ప్రారంభించారు. అయితే తిరుమల బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న భవనం వద్ద రోడ్డును కొంతవరకు అసంపూర్తిగా వదిలేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థల యజమానులు అంగీకారం తెలపకపోవడంతో ఈ రోడ్డు అసంపూర్తిగా వుండిపోయింది. గత యేడాది సెప్టెంబరులో రోడ్డు పక్కనున్న భవనాన్ని కొందరు కొంత తొలగించేందుకు ప్రయత్నించారు.ఆ సమయంలో కొంత ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. మున్సిపల్ అధికారులను అడగ్గా తమకు సంబంధం లేదని చెప్పారు. రోడ్డుకు ఒకవైపు స్థలం అన్నా రామచంద్రకు సంబంధించింది కాగా మరోవైపు ఈ భవనం వుంది. ఇంతలో ఎన్నికలు సమీపించడంతో సమస్య అలాగే ఉండిపోయింది. ఈ నేపథ్యంలో మంగళవారం అన్నా రామచంద్ర ఆ భవనంలోకి వెళ్లినట్లు, అక్కడున్న ఒకరిపై ఆయన అనుచరుడు చేయి చేసుకున్నట్లు, అనంతరం బయటకు వచ్చి ఆ భవనం గోడపై ఈ బిల్డింగ్‌లో 15 అడుగులు పబ్లిక్ రోడ్డు అని రాసినట్లు ఆ వీడియోలో కన్పిస్తోంది.40 అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డులో తనకు సంబంధించిన స్థలంలో ఎక్కడ వెళుతుందో అన్న అనుమానంతో ఇలాంటి చర్యలకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది.

రఘుపతికి నాజీనామన్ అవార్డు



తిరుపతి రూరల్, జూలై 3: తిరుపతి రూరల్ మండలం చిగురువాడకు చెందిన కవి, రచయిత కేవీ రఘుపతి లెబనాన్‌కు చెందిన నాజీ నామన్ ఫౌండేషన్ ఫర్ గ్రాటిస్ కల్చర్ అవార్డుకు ఎంపికయ్యారు. మానవ విలువలు పునరుజ్జీవింపజేసేందుకు, మన నాగరికతను ముందుకు తీసుకెళ్లడానికి రచనలు చేస్తున్న వారికి నాజీ నామన్ సాహిత్య బహుమతులను ప్రదానం చేస్తారు. వచ్చే నెలలో ఈ అవార్డును అందజేస్తారు.గతంలో మైఖేల్ మధుసూదన్ దత్ అకాడమీ అవార్డు(2000), రాక్ పెబుల్స్ నేషనల్ అవార్డు(2014), కింగ్ ప్రేసల్ అర్బింద్ చౌదరి నేషనల్ అవార్డు(2018) తదితరాలను రఘుపతి అందుకున్నారు.



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐలు కుసుమ, శ్రీనివాసరావు

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్ : డీటీవో

తిరుపతి (జీవకోన), జూలై 3: తిరుపతి జిల్లాలో పాఠశాల, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ అధికారులు ఫోకస్ పెట్టారు. జిల్లా పరిధిలోని తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట ఆర్టీఏ పరిధిలో పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి 1,784 బస్సులు ఉన్నాయి. అందులో జూలై 1 వరకు 1,104 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందగా, ఇంకా 680 బస్సులకు పొందాల్సి ఉంది. ఎఫ్‌సీల గడువు ముగిసిన వెంటనే బస్సులను యథావిధిగా కండీషన్‌లో పెట్టుకోవాల్సి ఉంటుంది. అనంతరమే ఆ బస్సులకు సర్టిఫికెట్లను ఆర్టీఏ అధికారులు జారీ చేస్తారు. తర్వాత రోడ్లపై బస్సులు తిరగాల్సి ఉంటుంది. ఫిట్‌నెస్‌తో పాటు ధ్రువపత్రాలు లేకుండా రోడ్లపై తిరిగితే ఆర్టీఏ అధికారులు ఆ బస్సులను సీజ్ చేస్తారు. ఓ పక్క పాఠశాలలు, మరో పక్క కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఆర్టీఏ అధికారులు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించారు. ఇప్పటి వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందని బస్సులపై కొరడా ఝుళిపించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకించి స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా ఏపీ మోటర్ వెహికల్ రూల్ 186-జి ప్రకారం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ల బస్సులకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. వీటిని పాటించడంతో పాటు బస్సుకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలి.

ఫిట్‌నెస్ లేకపోతే బస్సులు సీజ్



రోడ్లపై తిరిగే ప్రతిస్కూల్, కళాశాల బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) తప్పనిసరిగా కలిగి ఉండాలి. లేని పక్షంలో ఆ బస్సులను సీజ్ చేస్తాం. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించాం. రోడ్లపై ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా తిరిగే స్కూల్ బస్సులను ఎంవీఐలు తనిఖీ చేసి ధ్రువపత్రాలు లేని పక్షంలో అపరాధ రుసుం విధించడంతో పాటు బస్సులను సీజ్ చేస్తాం. ఈ స్పెషల్ డ్రైవ్ నెలరోజుల పాటు కొనసాగుతుంది.

- ఆదినారాయణ, డీటీవో

ఎర్రచందనం కేసులో ముగ్గురికి జైలు

శ్రీకాళహస్తి, జూలై 3: ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురికి ఆరు నెలల జైలు శిక్ష ఖరారైనట్లు శ్రీకాళహస్తి రూరల్ ఇన్‌ఛార్జి సీఐ నరసింహారావు తెలిపారు.శ్రీకాళహస్తి మండలంలోని గొల్లపల్లి అటవీ ప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు 2014వ సంవత్సరంలో అప్పటి ఎస్ఐ సంజీవకుమార్‌కు సమాచారమందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశారు.తిరుపతి నగరం అంబేడ్కర్ నగర్‌కు చెందిన శివ, దాము, మురళి ఎర్రచందనం తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. శ్రీకాళహస్తి న్యాయస్థానంలో ఈ కేసుకు సంబంధించి బుధవారం తీర్పు వెలువడింది. ముద్దాయిలు ముగ్గురికి ఆరునెలల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు సీఐ నరసింహారావు తెలిపారు. ఈ కేసు విచారణలో చురుగ్గా వ్యవహరించిన అధికారులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

అధికారులతో సమీక్ష చేయలేదు

ఆరణి శివకుమార్

తిరుపతి, జూలై3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను కమిషనర్ అదితిసింగ్ దృష్టికి తీసుకెళ్లేందుకే తాను కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లినట్టు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'తిరుపతిలో షాడో ఎమ్మెల్యే' అంటూ వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని వినతులను ఇచ్చేందుకు తాను మర్యాదపూర్వకంగా కమిషనర్‌ను కలిశానని, తాను అధికారులతో ఎలాంటి సమీక్ష నిర్వహించలేదని, ఎక్కడా కూడా ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు.

నెత్తకుప్పం జాతరలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రామచంద్రాపురం, జూలై 3: నెత్తకుప్పం జాతరలో అపశ్రుతి దొర్లింది. విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందారు. గ్రామంలో మంగళవారం రాత్రి జాతర ప్రారంభమైంది. బుధవారం వేకువజామున అమ్మవారిని ఊరేగించాక నడివీధిలో కొలువుదీర్చారు. మధ్యాహ్నం గ్రామ బలి కార్యక్రమాన్ని గోపి(45) అనే వ్యక్తి నిర్వహించాడు. అమ్మవారు కొలువు దీరే చోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోని ఇద్దరు త్రుటిలో తప్పించుకున్నారు. గోపి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

తలకోన నీటి మళ్లింపుపై సమగ్ర నివేదిక

- ఎమ్మెల్యే నాని ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ఎర్రావారిపాలెం, జూన్ 3: తలకోన నీటి సద్వినియోగంపై అడుగులు పడుతున్నాయి. దీంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ అటవీ ప్రాంతం నుంచి వర్షపు నీరు వృధాగా సముద్రంలో కలిసి పోతున్న సంగతి తెలిసిందే. దీనిపై కొన్నాళ్లుగా తలకోన నీటి సాధన కమిటీ అధ్యక్షులు మారేళ్ల శ్రీనువాసులు ఆధ్వర్యంలో ఉద్యమం చేశారు. తలకోన నీటిని చిన్నగొట్టిగల్లు ,ఎర్రావారిపాలెం మండలాల చెరువులకు మళ్లించి సాగుకు కృషి చేస్తానని ఎన్నికల సమయంలో పులివర్తి నాని చెప్పారు. ఎమ్మేల్యేగా గెలిచిన వెంటనే ఆయన ఈవిషయం మీద దృష్టి పెట్టారు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ఇరిగేషన్ అధిరులను ఇటీవల ఆదేశించారు. ఈ క్రమంలో తిరుపతి ఇరిగేషన్ ఈఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలోని బృందం బుధవారం మడి చెరువు, వలసపల్లె చెరువులను పరిశీలించింది. ఏటా సముద్రంలోకి వృధాగా పోతున్న నీటి వివరాలను సేకరించింది. అధికారులు సమగ్ర నివేదిక తయారు చేసి ఎమ్మెల్యే నానికి సమర్పించనున్నారు. ఇరిగేషన్ అధికారులతో పాటు తలకోన సాధన కమిటీ అధ్యక్షులు శ్రీనివాసులు, రైతులు పరిశీలనలో పాల్గొన్నారు.

10 నుంచి కల్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు

చంద్రగిరి, జూలై 3: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవాలు ఈనెల 10 నుంచి 12వ తేది వరకు నిర్వహించనున్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 10న పెద్ద శేష వాహనంపై, 11న హనుమంతు వాహనంపై, 12న గరుడ వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుతుంది. 13న పార్వేట ఉత్సవం నిర్వహించనున్నారు.

శ్మశానానికి దారి లేక ....



చిట్టమూరు, జూలై 3: మెట్టు గిరిజన కాలనీవాసులకు శ్మశానానికి దారి లేక మృతదేహాన్ని పొలాల గట్లపై, పైరును తొక్కుంటూ తీసుకెళ్లాల్సి దుస్థితి నెలకొంది. మెట్టులో ఎవరైనా మృతి చెందితే గ్రామానికి దగ్గర్లో ఉన్న స్వర్ణముఖి నదిలో అంత్యక్రియలు చేయాల్సి ఉంది. అయితే నదికి చేరుకోవాలంటే సుమారు రెండు కిలోమీటర్లు దూరం వెళ్లాలి. మృతదేహాన్ని మోసుకొని అంతదూరం వెళ్లడం ఇబ్బందిగా మారిందని గిరిజనులు వాపోతున్నారు. చేసేది లేక అడ్డదారిలో పొలాల గట్లపై, పంటలపై మోసుకెళ్తున్నామని వాపోయారు. బుధవారం గిరిజన కాలనీలో వ్యక్తి చనిపోతే పొలాల్లోనే మృతదేహాన్ని మోసుకొని వెళ్లారు. గత ప్రభుత్వంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ న్యాయం జరగలేదని వాపోయారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

గూడూరు, జూలై 3: పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... వేకువ ఝాము నుంచే పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా పారిశుధ్య పనులు చేపడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లుగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, ఇతర సామగ్రిని ఇవ్వక పోవడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించిన సీఎం చంద్రబాబు వారికి దుస్తులను, ఇతర సామగ్రిని అందించారన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విందూరు హెడ్ వాటర్‌వర్క్సులో మోటర్లు, బోర్ల మరమ్మతులకు గుర్రైనా పట్టించుకోకపోవడంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. రెండు రోజులుగా తాగునీటి సరఫరా పైపులైన్ల మరమ్మతులు చేపడుతున్నామని, ఇకపై అంతరాయం లేకుండా నీరందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే పట్టణానికి రెండుపూటలా నీరందిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. టీడీపీ నాయకులు శీలం కిరణ్‌కుమార్, పి.శ్రీనివాసులు, చాన్‌బాషా, శివకుమార్, వెంకటేశ్వర్లురాజు, రవీంద్రరెడ్డి, నరసింహులు, పెంచలయ్య, జహంగీర్, సిద్దయ్యనాయుడు, భారతి, నాగరాజు, ఇశ్రాయిల్‌కుమార్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే

కదలని మురుగు... పడేనా మెరుగు!



గూడూరు దండోరా కాలనీలో దుస్థితి - చిల్లకూరు అరుంధతీయవాడలో మురుగు కదలని కాలువ- బోరు వద్ద అధ్వానంగా ఉన్న పరిసరాలు

గూడూరు, జూలై 3: పట్టణంలోని పలు ప్రాంతాలలో డ్రైనేజీ కాలువలను అభివృద్ధి చేయకపోవడంతో రోడ్లపై మురుగు నిల్వచేరడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రెండో పట్టణ పరిధిలోని దండోరా కాలనీ, నాయీ బ్రాహ్మణకాలనీ, ప్రశాంతినగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పలు చోట్ల డ్రైనేజీ కాలువలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ కాలనీల్లో సుమారు ఆరు వందలకు పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. ప్రధాన రహదారుల మినహా అంతర్గత రోడ్ల వద్ద డ్రైనేజీ కాలువలను నిర్మించకపోవడంతో మురుగు రోడ్లపైకి ప్రవహిస్తూ నిల్వచేరి మడుగులా మారుతోందని వాపోతున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలతో ఇబ్బంది పడతున్నాయని వాపోయారు. ఈ కాలనీల్లోని కొన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు నిర్మించకపోవడంతో ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే వాన నీరు, మురుగు కలిసి రోడ్లపై ప్రహిస్తుండడంతో బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు మురుగు నిల్వచేరకుండా చర్యలు తీసుకోవడంతోపాటు డ్రైనేజీ కాలువలను అభివృద్ధిపరచి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

చిల్లకూరు: మండల కేంద్రంలో మురుగునీటి కాలువల్లో మురుగు ముందుకు కదలక నిల్వచేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అరుంధతీయవాడలో సమస్య తీవ్రంగా ఉంది. అలాగే మురుగునీటి కాలువలు లేకపోవడంతో చేతిబోరు వద్ద నీరు నిల్వచేరి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. మూడు రోజుల క్రితం అరుంధతీయవాడలో ఐదుగురు అతిసారకు గురయ్యారు. దీంతో వడ్డిపాళెం, శంకరన్‌గిరిజకాలనీ, మిక్సిడ్ కాలనీ, దళితవాడలోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శంకరన్ గిరిజన కాలనీలో కూడా దాదాపు ఇదే పరిస్థితి. కొన్ని చోట్ల మురుగులో పందులు సంచరిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



గూడూరు నాయీ బ్రాహ్మణకాలనీలో...

కాలుష్య కోరల్లో నీటి పథకం... పొంచివున్న ప్రమాదం



వ్యర్థాలతో నిండిన దేగలపాలెం చెరువు - చెరువులో ఉన్న నీటి పథకాలు

సూళ్లూరుపేట, జూలై 3: పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు తాగునీరందించే నీటి పథకాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. పట్టణానికి ఉన్న నీటి వనరులు కళ్లదుటే కలుషితమవుతాఉన్నా అధికార యంత్రాంగంలో మాత్రం చలనం లేదు. దీని బాగోగులు చూడాల్సిన ఇంజినీరింగ్ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

సూళ్లూరుపేట పట్టణంతో పాటు కేసియన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీలకు కసారెడ్డిపాలెం సమీపంలో ఉన్న దేగలపాలెం చెరువులో నీటి పథకాలు ఏర్పాటు చేశారు. ఈ చెరువులో దాదాపు 10 బోరు పాయింట్లు వేసి అక్కడ నుంచి ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఉన్న 10 బోరు పాయింట్లలో రెండు చెరువులో పూడిపోయాయి. మిగిలిన 8 పాయింట్లలో 6 బోర్ల ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని బాపూజీ కాలనీ, రాజీవ్‌నగర్, కోళ్లమిట్ట, ఇసుకమిట్ట, స్వతంత్రపురం, సోనియాగాంధీ నగర్, కసారెడ్డిపాలెం, కేఆర్‌పాలెంలకు తాగునీరు అందిస్తున్నారు. అంటే మున్సిపాలిటీ పరిధిలో సగభాగానికి పైగా ఈ చెరువులో ఉన్న నీటి పథకాల ద్వారానే తాగునీరు అందుతోంది. అదే విధంగా మండల పరిధిలోని కేసియన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీలకు కూడా రెండు బోరు పాయింట్ల ద్వారా సురక్షిత తాగునీరిస్తున్నారు. ప్రజల దాహార్తి తీర్చే దేగలపాలెం చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకొంది. దీంతో చెరువులో వ్యర్థాలతో పాటు పిచ్చిచెట్లు దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు పలుచోట్ల చెరువులో పట్టణం నుంచి మురుగు కూడా కలుస్తోంది. చెరువులో పశువుల వ్యర్థాలు కూడా కలుస్తున్నాయి. వర్షాకాలంలో అయితే మురుగునీటి కాలువలు, రోడ్ల పై ప్రవహించే నీరంతా చెరువులోకి చేరుతున్నాయి. ప్రజల దాహార్తిని తీర్చే చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పలుమార్లు స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలుస్తోంది. ప్రజలకు తాగునీరందించే దేగలపాలెం చెరువు కాలుష్య కోరలనుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

ఆక్రమణల చెరలో విన్నమాల పంటకాలువ

నాయుడుపేట, జూలై 3: నాయుడుపేట ఎల్ఏసాగరం నుంచి స్వర్ణముఖినదిలో ప్రారంభమయ్యే విన్నమాల పంటకాలువ పట్టణ నడిబొడ్డు నుంచి జాతీయ రహదారి, రైల్వే ట్రాక్‌ను దాటుకొని విన్నమాల చెరువుకు నదినీరు అందిస్తుంది. విన్నమాల పంటకాలువ దాదాపు 110 లింకులు వెడల్పుతో ఉండాల్సి ఉండగా నేడు ఆక్రమణలతో 50 అడుగుల మేర కుచించుకుపోయింది. విన్నమాల పంటకాలువ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఏసాగరం నుంచి ప్రారంభమై బీడీకాలనీ, టీచర్ కాలనీ, పాత ట్రెజరీ ఏరియా, పొగ గొట్టం కాలనీ, రజక కాలనీ, ఆకుతోట వీధి, ఎల్ఐసీ, ఆర్మూగం నగర్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి జాతీయ రహదారి, రైల్వే ట్రాక్‌ను దాటుకొని విన్నమాల చెరువుకు చేరుతుంది. పంటకాలువ అంతా దాదాపు మున్సిపాలిటీ పరిధిలో ఉండటంతో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో విన్నమాల పంటకాలువను మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఆక్రమణలను తొలగించి రూ.38 కోట్ల తో ఆధునీకరించేలా నివేదిక పంపారు. కార్యాచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలువ ఆక్రమణలను తొలగించి విన్నమాల చెరువుకు నీరు చేరేలా చూడాల్సి ఉంది.



ఆక్రమణలతో కుచించుకుపోయిన విన్నమాల పంటకాలువ

ఇండస్ పరిశ్రమ చేయూత అభినందనీయం

నాయుడుపేట, జూలై 3: ఇండస్ కాఫీ పరిశ్రమ ద్వారకాపురంలో రూ.7.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినంద నీయమని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని ద్వారకాపురంలో టీడీపీ నాయకులు గాలి రాజేష్‌నాయుడు, గుంటూరు ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నెలవల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మినరల్ వాటర్ ప్లాంట్ అందించిన ఇండస్ మేనేజింగ్ డైరెక్టర్ మణికి అభినందనలు తెలిపారు. మేనకూరు సెజ్‌లోని పరిశ్రమల యాజమాన్యాలు వారి వ్యాపార లావాదేవీల్లో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద 2 శాతం నిధులను సెజ్ కోసం భూములు కోల్పోయిన గ్రామాల్లో మౌలిక వసుతులకు కేటాయించాలని కోరారు. అలాగే కొన్ని గ్రామాలను పరిశ్రమలు దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండస్ కాఫీ ఈడీ రవీంద్ర, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, కె.రమణారెడ్డి, నాయుడుపేట మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షేక్ రఫీ, టీడీపీ మండల అధ్యక్షుడు కె.అశోక్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్లాంట్ ప్రారంభోత్సవం

రైల్వేస్టేషన్‌లో పోలీసు తనిఖీలు



సూళ్లూరుపేట, జూలై 3: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేశారు. వైజాగ్, హైదరాబాద్, విజయవాడల నుంచి వచ్చే రైళ్లలో గంజాయి, మత్తుపదార్థాలు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారన్న సమాచారంతో డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రయాణికులను తనిఖీ చేసి వారి వివరాలు సేకరించారు. గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు రైల్వేస్టేషన్, బస్టాండులో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ మధుబాబు, ఎస్ఐ కోట రహీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలతో త్వరిగతిన కేసుల పరిష్కారం

వెంకటగిరి టౌన్, జూలై 3: కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలతో కేసులు త్వరితగతిన పరిష్కారమవుతాయని ఏఎస్పీ ప్రకృతి కుమార్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. కేసు నమోదైన 14 రోజుల్లోనే కొలిక్కి తీసుకు వచ్చే విధంగా కొత్త చట్టం సూచిస్తుందన్నారు. పోలీసు దర్యాప్తుల్లో అనుసరించే సాంకేతిక, ఆధునాతన విధానాలు కేసు విచారణ సమయంలో దోహదపడుతాయని తెలిపారు. ఈ చట్టల వలన శిక్షలు పక్కాగా అములవుతాయన్నారు. దీంతో చోరీ, మోసం కేసుల్లో రికవరీకి పోలీసులకు పూర్తి స్థాయి అవకాశం కల్పించడంతో పాటు బాధితలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలు కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు కేటాయించండి



రైల్వే బోర్డు చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ వరప్రసాదరావు

గూడూరు, జూలై 3: పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్లు మాజీ ఎంపీ వరప్రసాదరావు బుధవారం తెలిపారు. ఢిల్లీలో రైల్వేబోర్డు ఛైర్ పర్సన్ జయవర్మసింహ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని విన్నవించామన్నారు. గూడూరు పడమర వైపు రైల్వే స్టేషన్‌లో నిర్మించిన రిజర్వేషన్ కౌంటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, ఎస్ఆర్ఏ టాకీస్ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, గూడూరు రైల్వేజంక్షన్‌లో వందేభారత్‌కు స్టాపింగ్ కల్పించాలని విన్నవించామన్నారు. అదేవిధంగా వాకాడు మండలం తీరప్రాంత గ్రామాలైన పూడిరాయిదొరవు, నవాబుపేట, చిన్నతోట తదితర గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు లేనికారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కేంద్రప్రభుత్వమే ముందుకు వచ్చి టవర్‌ను నిర్మిస్తే తీరప్రాంత ప్రజలకు సమాచార వ్యవస్థ అందుబాటులోకి వచ్చి ఉయోగకరంగా ఉంటుందని డిజిటల్ కమ్యూనికేషన్ కమిషన్ ఛైర్మన్ నీరజ్‌మిట్టల్‌ను కలిసి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారంతో కేంద్రప్రభుత్వం నుంచి ని ధులు తీసుకువచ్చి పలు అభివృద్ధిపనులు చేపట్టేలా చర్యలు తీసుకుం టామన్నారు.

పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు



వెంకటగిరి టౌన్, జూలై 3: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాతకోట వద్ద ఉన్న రామాలయంలో బుధవారం లెక్కించారు. మార్చి నుంచి 100రోజులకు గాను రూ.13,42,513 వచ్చిందని ఆలయ ఈవో ఏ.శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. 3.5 గ్రాముల బంగారం, 84 గ్రాముల వెండి, 30 యూఎస్ డాలర్లు, 5 కువైట్ దినార్లు వచ్చాయని తెలిపారు. కార్యక్రమ పర్యవేక్షణ అధికారిగా దేవుని వెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి ఎన్.శ్రీధర్ నాయుడు వ్యవహరించారు. ఇక లెక్కింపులో రెవెన్యూ, పోలీసులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

చిల్లకూరు, జూలై 3: నూతనంగా అమల్లోకి వచ్చిన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా రక్షణ, మహిళాభద్రత, న్యాయాన్ని నిర్ధారించడం, నమ్మకాన్ని పెంచడం, సాధారణ పౌరుడిని శక్తివంతమైన పౌరుడుగా చేసే విధంగా నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే ఎవరైనా మృతిచెందితే దానికి కారణమైన వారికి 10 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందన్నారు. వాహన చోదకులు జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు.

అనాథాశ్రమానికి చేయూత

నాయుడుపేట, జూలై 3: పట్టణంలోని ఎల్ఏసాగరంలోఉన్న చేయూత అనాథాశ్రమంలో షేక్ జాఫర్ జన్మదినం చేసుకున్నారు. విద్యార్థుల నడుమ కేక్ కట్ చేశారు. ఆశ్రమానికి అవసరమైన బియ్యం, పప్పు దినుసులు, నిత్యావసర సరుకులను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సామంత్‌రెడ్డి, సన్నిస్‌రెడ్డి, రమేష్, కిరణ్, వెంకీ, ఆశ్రమ నిర్వాహకుడు టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సులో నగల చోరీ

నాయుడుపేట టౌన్, జూలై 3 : ప్రైవేట్ ట్రావెల్ బస్సులో బంగారు నగలు చోరీ జరిగినట్లు బాధితురాలు నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పశ్చిమ గోదావరిజిల్లా భీమవరానికి చెందిన మహిళ బెంగళూరుకు వెళ్లేందుకు ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఎక్కింది. బుధవారం ఉదయం 5 గంటలకు నాయుడుపేటకు చేరుకుంది. అదే సమయంలో ఆ మహిళ తన బ్యాగులో ఉంచిన 8 సవర్ల నగలు లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సిబ్బందితో కలసి నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నాయుడుపేట టౌన్, జూలై 3 : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన చట్టాలలో మార్పులు చేయాలంటూ గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్ తెలిపారు. ఈమేరకు కక్షిదారులు, న్యాయవాద మిత్రులు సహకరించాలని ఆయన కోరారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, జూలై 3: పట్టణంలోని క్రాస్‌రోడ్డులో మద్యం బెల్టు దుకాణానికి తరలిస్తున్న 40 మద్యం సీసాలను బుధవారం ఎస్ఐ నాగబాబు స్వాధీనం చేసుకున్నారు. వెంకటరమణయ్య అనే యువకుడు క్రాస్‌రోడ్డు నుంచి నెల్లూరుపల్లికొత్తపాళెంలోని బెల్టుదుకాణానికి తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అలాగే నిందితుడి బైక్‌ను స్వాధీని చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు పాశిం విజయోత్సవ ర్యాలీ

వాకాడు, జూలై 3: ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఈనెల 4న వాకాడు మండలానికి విచ్చేస్తున్న సందర్భంగా కూటమి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యానగర్ నుంచి టీడీపీ నాయకుడు చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు. రంగన్నగుంట నుంచి బ్యారేజీ మీదుగా అశోక్‌పిల్లర్, బీసీ కాలనీ, గొల్లపాళెం వరకు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ర్యాలీ కోసం టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, కుంచం దయాకర్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బత్తిన ప్రమీల తదితరుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, జూలై 3: మండలంలోని పండ్లూరు గ్రామ సమీపాన రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకొని మృతి చెంది నట్లు రైల్వే ఎస్ఐ కొండప్పనాయుడు తెలిపారు. యువకుడి వయసు 30 సంవత్సరాలు ఉంటుందని, గళ్లలుంగి, గళ్లచొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారం లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జడ్పీటీసీలకు కేటాయించిన నిధులపై
శ్వేతపత్రం విడుదల చేయండి



జడ్పీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న జడ్పీటీసీ తిరుమలయ్య

ఏర్పేడు, జూలై 3: గడచిన ఐదేళ్లల్లో జడ్పీటీసీలకు కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏర్పేడు జడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య డిమాండ్ చేశారు. బుధవారం చిత్తూరులో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఏర్పేడు జడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య, శ్రీకాళహస్తి జడ్పీటీసీ కేవీ సుబ్బారెడ్డి, తొట్టంబేడు జడ్పీటీసీ అర్చనదేవి పసుపు కండువాలు ధరించి హాజరయ్యారు. సమావేశ మందిరంలో సీఎం చంద్రబాబు చిత్రపటం లేకపోవడాన్ని గుర్తించిన ఏర్పేడు జడ్పీటీసీ ప్రశ్నించడంతో వెంటనే ఏర్పాటు చేశారు. అనంతరం నాలుగు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జడ్పీ చైర్మన్‌కు అందజేశారు.

శ్రీకాళహస్తీశ్వరాలయానికి రూ.1.50లక్షల విరాళం

శ్రీకాళహస్తి, జూలై 3: శ్రీకాళహస్తీశ్వరాలయానికి హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణారావు, మధుకుమారి బుధవారం రూ.1.50లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యనే మద్యం అమ్మకాలు

శ్రీకాళహస్తి, జూలై 3: శ్రీకాళహస్తి పట్టణంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తూ ఇళ్ల మధ్యనే మద్యం విక్రయాలు సాగిస్తున్నారంటూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో కొందరు పెద్దఎత్తున ఇంట్లో మద్యం సీసాలను నిల్వ చేసుకుని విక్రయిస్తున్నారని స్థానికులు సామాజిక మాధ్యమాల్లో విమర్శలు గుప్పించారు. కొన్నేళ్లుగా ఇళ్ల మధ్యనే మద్యం అమ్మకాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎన్టీఆర్ నగర్‌తో పాటు పట్టణంలోని బెల్ట్ దుకాణాలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట, జూలై 3: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఉదయం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు... రైల్వేస్టేషన్‌లోని 1వ నెంబరు ప్లాట్‌ఫారం చివరలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయసు సుమారు 55 ఉంటుందని, మెరూన్ కలర్ షర్టు, తెల్ల ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రగతి ట్రస్టు సభ్యులు

కేవీబీపురం, జూలై 3: కేవీబీపురం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ట్రస్టు కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అందరూ ప్లాస్టిక్‌ను నిషేధించి వాటి స్థానంలో గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్‌ను వాడకాన్ని తగ్గించే విధంగా గ్రామస్థులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు వెంకటకృష్ణయ్య, ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, భానుప్రకాష్, ట్రస్టు సిబ్బంది గంగయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై వ్యాసరచన పోటీలు

శ్రీసిటీ(వరదయ్యపాళెం), జూలై 3: వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో గున్నయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీంద్రరెడ్డి, ప్రజాప్రగతి మండల కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వండి

కేవీబీపురం, జూలై 3: మండలంలో గ్రీన్ అంబాసిడర్లకు గత పది నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. కూలి పనులు కూడా మానుకుని పారిశుధ్య పనులు చేస్తున్నామని, పది నెలలుగా జీతాలు ఇవ్వకపోవ డంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామని గ్రీన్ అంబాసిడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు జీతాలు అందజేయాలని కోరుతున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వైభవంగా ప్రదోష నంది సేవ

శ్రీకాళహస్తి,జూలై 3: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం త్రయోదశిని పురస్కరించుకుని వైభవంగా ప్రదోష నందిసేవ నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు ఆలయ అలంకార మండపంలో పలు రకాల అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. దూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య ప్రదోష నందిసేవ ఆలయ ప్రాకారంలో నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

దివ్యాంగురాలికి పరామర్శ



దివ్యాంగురాలిని పరామర్శిస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జూలై 3: శ్రీకాళహస్తి, జూలై 3: హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో దాత ఉమేష్‌రావు సహకారంతో పట్టణంలోని పూసలవీధిలో పేదలు, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ చేతల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కదలేని స్థితిలో ఉన్న హమీదాబేగం అనే దివ్యాంగురాలికి సాధారణ పింఛను ఇస్తున్నట్లు తెలుసుకుని చలించిపోయారు. వైద్యుల చేత పరీక్ష చేయించి వికలాంగుల పింఛను అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నివేదిత మోరె, నెమళ్లూరు బుజ్జి, మహబూబ్‌బాషా, సయ్యద్ చాంద్‌బాషా, రియాజ్, హబీబ్, కోట చంద్రశేఖర్, మునిరాజాయాదవ్, పాండు, కృష్ణమూర్తి, భాస్కర్, మణి, వంశీ, శేషు, శివ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలం ఆక్రమణ
తొలగించిన అధికారులు

నాగలాపురం, జూలై 3: నాగలాపురం ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని వేసుకున్న గుడిసెలను సత్యవేడు డిపో అధికారులు తొలగించారు. నాగలాపురం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఆర్టీసీకి సంబంధించిన సర్వే నెంబరు 996లో 56 సెంట్లు ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలాన్ని స్థానికులైన ఖాదర్ బాషా, నైనా మొహదీన్ ఆక్రమించి గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నారు. ఆర్టీసీ అధికారులు గుడిసెలు తొలగించాలని పలుమార్లు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. పట్టించుకోకపోవడంతో బుధవారం ఆర్టీసీ అధికారులు నాగలాపురం ఎస్ఐ ఓబయ్య, వీఆర్వో నాగభూషణంతో కలిసి సంఘటనా స్థలాన్ని చేరుకుని ఎక్స్‌కవేటర్ల సాయంతో అక్రమంగా నిర్మించిన గుడిసెలను తొలగించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వర్మ, హెడ్ కానిస్టేబుల్ దశరధరాజు, పవన్‌కుమార్, సివిల్ ఇంజనీర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

శ్రీసిటీ, జూలై 3: శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్ (ఎస్ఆర్ఎం), శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్తంగా స్థానిక మెడికల్ సెంటర్ ఆవరణలో బుధవారం నిర్వహించిన చిన్న పిల్లల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై శ్రీరామచంద్ర హాస్పిటల్స్‌కు చెందిన ప్రత్యేక వైద్య నిపుణుల బృందం వైద్య సేవలు అందించింది. శ్రీసిటీ పరిసర గ్రామాలకు చెందిన వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సుమారు 200మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త హీనత, చర్మవ్యాధి సమస్యలు ఉన్న పిల్లలకు మందులను ఉచితంగా అందించారు. శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు నిరీష్ సన్నారెడ్డి, సురేంద్ర కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.





సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం - తరగతి గదుల్లో పెచ్చులూడిన శ్లాబ్

శిథిలావస్థలో సత్యవేడు డిగ్రీ కళాశాల భవనం

బాబు హామీతో శాశ్వత భవన నిర్మాణంపై ఆశలు

సత్యవేడు, జూలై 3: సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మిస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీపై విద్యార్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సత్యవేడులో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాల నిర్వాహణకు స్థలం దొరక్క స్థానిక తెలుగుగంగ డివిజనల్ కార్యాలయ పాత భవనంలో తాత్కాలికంగా తరగతులను ప్రారంభించారు. శాశ్వత భవనం కోసం పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాల వెనుక పది ఎకరాల స్థలం కేటాయించారు. పనులు ప్రారంభించే నాటికి రాష్ట్రంలో సమైక్యాంధ్ర ఉద్యమం ఉధృతంగా ఉండడంతో భవన నిర్మాణం మరుగున పడింది. 2018లో కళాశాల నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించింది. అయితే టెండర్ల దశలో ఎన్నికలు సమీపించడం వల్ల కళాశాల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో కళాశాల భవన నిర్మాణం జరుగుతుందని అందరూ భావించారు. అయితే డిగ్రీ కళాశాలకు కేటాయించిన పదెకరాల స్థలంలో గత వైసీపీ ప్రభుత్వం జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం పట్టాలను మంజూరు చేసింది. ప్రస్తుతం డిగ్రీ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుని, పెచ్చులూడిపోతోంది. మారడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఏప్రిల్ 20న ఎన్నికల ప్రచారం నిమిత్తం సత్యవేడుకు వచ్చిన చంద్రబాబు టీడీపీ అధికారంలోకి వస్తే డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కళాశాల నిర్మాణం కోసం అడుగులు పడుతాయని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

వైభవంగా ప్రదోష పూజలు



నందీశ్వరుడికి అభిషేకం

నాగలాపురం, జూలై 3: నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో బుధవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని పరివార దేవతలకు అభిషేకాలు చేసి విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాలు చేసి దీప దూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడిని వివిధ పుష్పాలతో పుష్పాలంకరణ చేపట్టి మహా హారతి, నక్షత్ర హారతి, కుంభ హారతులు చేపట్టారు. ప్రదోష పూజానంతరం ఉత్సవ మూర్తులైన స్వామి, అమ్మవార్లకు ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ఉపాధి పథకంతో పేదరిక నిర్మూలన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 3: ఉపాధి హామీ పథకం ద్వారా పేదరిక నిర్మూలన జరుగుతుందని సర్పంచు వెంకటమ్మ అన్నారు. మండల కేంద్రంలోని సచివాయలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ బుధవారం జరిగింది. గ్రామంలో 48 పనులకు ఖర్చు చేసిన రూ.35లక్షలకు సంబంధించి వివరాలను డీఆర్‌పీలు వివరించారు. పనుల్లో జరిగిన అవకతవకలను గ్రామస్తుల దృష్టికి తీసుకువచ్చారు. ఏపీఎం భానుప్రియ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పండ్లతోట మొక్కలు నాటుకుంటే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ప్రేరణలో సంతవేలూరు విద్యార్థిని

వరదయ్యపాళెం, జూలై 3: గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో గత నెల 23 నుంచి 29వ తేదీ వరకు జాతీయస్థాయిలో జరిగిన ప్రేరణ కార్యక్రమంలో వరదయ్యపాళెం మండలంలోని సంతవేలూరు ఉన్నత పాఠశాలకు చెందిన డి.ఝాన్సీ పాల్గొంది. జిల్లా, రాష్ట్ర ప్రాముఖ్యతలను వివరించింది. బుధవారం సంతవేలూరు ఉన్నత పాఠశాలలో ఆ విద్యార్థిని ఝాన్సీని ఉపాధ్యాయులు సత్కరించారు. హెచ్‌ఎం మాధవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, జూలై 3: పట్టణంలోని ఎంజీఎం విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చూపారు. విద్యార్థులు ధరణి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు, నిఖిల్ రవిసాయి 7వ ర్యాంకు, లిఖిత్‌కుమార్ 15వ ర్యాంకు సాధించారు. వారిని విద్యాసంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు



గోరసే ప్రసాద్ దత్తాత్రేయ, కంచన్‌రామ్ మీనాను సన్మానిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ(వరదయ్య పాళెం), జూలై 3: నెల్లూరు జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు గోరసే ప్రసాద్ దత్తాత్రేయ, కంచన్ రామ్ మీనా బుధవారం శ్రీసిటీని సందర్శించారు. వారికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలు, శ్రీసిటీ మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తికి ఎలా అద్దం పడుతుంది, ఉపాధి అవకాశాల సృష్టితో పాటు ఆర్థిక అభివృద్ధికి ఎలా దోహద పడుతోందో వివరించారు. శ్రీసిటీ వ్యాపార అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పారిశ్రామిక హబ్ ఏర్పాటును కొనియాడారు. ఇక్కడి ప్రతిష్ఠాత్మక బ్రాండ్‌ల ఉనికిని అభినందిస్తూ భవిష్యత్తులో దేశ పారిశ్రామిక ప్రగతిలో శ్రీసిటీ ముందంజలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు



ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు గుంతలు తవ్విస్తున్న అధికారులు

నారాయణవనం, జూలై 3: మండలంలోని అరుణానదిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎస్ఈబీ, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. అరుణ్యం కండ్రిగ పంచాయతీ గోవిందప్పనాయుడు కండ్రిగ పరిధిలో ఉన్న అరుణానది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. బుధవారం పుత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఉరుకుందమ్మ, రెవెన్యూ సిబ్బందితో కలిసి గోవిందప్పనాయుడు కండ్రిగ వద్ద అరుణానదిలో ఇసుక అక్రమ రవాణా తవ్వకాలను పరిశీలించారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించకుండా నదిలో గుంతలను తవ్వించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి, యజమాలనుపై కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

విద్యతో పేదరికం దూరం

శ్రీకాళహస్తి, జూలై 3: విద్యతో పేదరికం దూరం అవుతుందని సంఘసేవకులు యల్లంపాటి కోటేశ్వరబాబు అన్నారు. శ్రీకాళహస్తి మండలం మంగళపురి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 75మంది విద్యార్థులకు బుధవారం ఆయన విద్యాసామగ్రి పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలనే ఆశయంతో తాను విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



సీతారాముల ఊరేగింపు

వడమాలపేట, జూలై 3: స్థానిక సంజీవరాయ స్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవం భక్తుల కోలాహలం నడుమ వైభవంగా జరిగింది. ఉభయదారులు శివకుమార్‌రెడ్డి, శ్రీలేఖ దంపతుల ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం, గణపతి పూజ, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం సీతారాములను నూతన వధూవరులుగా పట్టు పీతాంబరాలతో అలంకరించి వేద మంత్రాలతో భాజాభజంత్రీల నడుమ మాంగళ్య ధారణ చేయించారు. రాత్రి సంజీవరాయ స్వామి, సీతారామ లక్ష్మణులను సుందరంగా అలంకరింపజేసి గ్రామంలో ఊరేగించారు. భక్తులు నారికేల కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

నింద్ర స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

నింద్ర, జూలై 3: నింద్ర పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ మణికంఠ బుధవారం తనిఖీలు చేశారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల పురోగతి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసుల ద్వారా విద్యా సంస్థలలో అవగాహన సదస్సులు నిర్వహించి, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి తెలియజేయాలని చెప్పారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. నగరి రూరల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి, నింద్ర ఎస్ఐ రామచంద్ర పాల్గొన్నారు.

పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పురిటిబిడ్డ మృతి

వైద్యుల అలసత్వమంటున్న తల్లిదండ్రులు ● వైద్యఆరోగ్యశాఖ అధికారుల విచారణ





బిడ్డ మృతిపై తల్లి పూర్ణిమను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ మురళీకృష్ణ - మృతి చెందిన మగబిడ్డ

పుత్తూరు అర్బన్, జూలై 3: పొత్తిళ్లలోనే ఆ బిడ్డకు నూరేళ్లు నిండాయి. కళ్లు విప్పి లోకం చూడకనే లోకం విడిచివెళ్లిపోయాడు. పుట్టిన మరునాడే విగతజీవుడయ్యాడు. వైద్యుల అలసత్వం కారణంగానే ఈ ఘోరం జరిగిందని బిడ్డ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ జరిపారు. కార్వేటినగరం మండల పరిధిలోని ద్వారకానగరానికి చెందిన జి.నరేష్ భార్య పూర్ణిమ పురిటి నొప్పులతో తొలికాన్పు కోసం సోమవారం సాయంత్రం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. పరీక్షించిన గైనకాలజిస్ట్ హిమబిందు గర్భిణి పూర్ణిమకు అదేరోజు రాత్రి కాన్పు చేయడంతో మగబిడ్డను ప్రసవించింది. మంగళవారం రాత్రి రౌండ్స్‌కు వచ్చిన డాక్టర్ దినేష్ బిడ్డ ఉలుకుపలుకూ లేకుండా ఉండడంతో ప్రత్యేక వార్డుకు తీసుకెళ్లి పరీక్షలు జరిపారు. అరగంట తరువాత బిడ్డ మృతి చెందినట్లు చెప్పడంతో పూర్ణిమ దంపతులు నిశ్చేష్టులయ్యారు. బిడ్డ లేడనే విషయం తెలియడంతో పూర్ణిమ సొమ్మసిల్లిపడిపోయింది. కాన్పు తరువాత వైద్యులు, నర్సులు బిడ్డ ఆరోగ్య పరిస్థితిని పట్టించుకోలేదని బిడ్డ తల్లిదండ్రులు ఆరోపించారు. కనీసం పూటకు ఒక్కసారి కూడా వచ్చి బాలింతను, బిడ్డను పరీక్షించలేదని వారు తెలిపారు. ఈ కారణంగానే తమ బిడ్డ మృతి చెందాడని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఇది జరుగుతుండగానే డ్యూటీ డాక్టర్ అశోక్‌కు బాధిత బంధువుల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. దీంతో ఆస్పత్రి ఆవరణ అరుపులు, కేకలతో దద్దరిల్లింది.

విచారణ జరిపిన జిల్లా అధికారులు

ప్రభుత్వాస్పత్రిలో పురిటిబిడ్డ మృతి చెందిన సంఘటనపై బుధవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ మురళీకృష్ణ విచారణ జరిపారు. బిడ్డ తల్లిదండ్రులు, వైద్యులతో పాటు నర్సులను వేరువేరుగా విచారించారు. దీనిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి 10గంటల సమయంలో బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గుర్తించిన డాక్టర్ దినేష్ కృత్రిమ శ్వాస ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. బిడ్డ పాలు తాగినప్పుడు ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. అలాగే తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కూడా ప్రభుత్వాస్పత్రిలో పసిబిడ్డ మృతిపై విచారణ జరిపారు. తహసీల్దార్ పుష్పకుమారి ప్రభుత్వాస్పత్రిలో పసిబిడ్డ మృతదేహానికి పంచనామా నిర్వహించారు. బిడ్డ తల్లిదండ్రులు, వైద్యులు, నర్సులను సైతం విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. నివేదికను చిత్తూరు కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.